ప్రజాశక్తి

శుక్రవారం 8 మార్చి 2024 8 + 4 పేజీలు



తిరుపతి

చిత్తూరు

భవిష్యత్ 'బక్క'చిక్కుతోంది..!

- రోజురోజుకూ పెరుగుతున్న రక్తహీనత
- పిల్లలు, గర్భిణీలు, మహిళలకు అందని పౌష్టికాహారం
- 12 వేల మందిని పరీక్షిస్తే 9 వేలమందిది ఇదే వ్యథ
- తూతూ మంత్రంగా సర్వేలు, కంటితుడుపు చర్యలు

ప్రజాశక్తి- తిరుపతి

పోషకాహార లోపంతో భవిష్యత్ బక్కచిక్కుతోంది. మహిళా శక్తి సైతం ఎనీమియాతో బాధపడుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మహిళల్లో 70శాతానికి పైగా రక్తహీనత వేధిస్తోంది. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ 12 వేలమంది మహిళలు, గర్భిణులను పరీక్షిస్తే 9 వేల మందికి పైగా రక్తహీనతతో బాధపడుతున్నట్లుగా తెలుస్తోంది. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక విద్యాకేంద్రాల్లోని పిల్లల్లోనూ దాదాపు 15 వేల మందికిపైగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. అటు ప్రభుత్వం, ఇటు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు తూతూ మంత్రంగా సర్వేలు చేసి కంటితుడుపు చర్యలు తీసుకుంటున్నారే తప్ప అవసరమైన పౌష్టికాహారానికి సరిపడా నిధులు కేటాయించడం లేదన్నది వాస్తవం.

వైద్యరంగంలో రాయలసీమకే తలమానికంగా నిలుస్తున్న తిరుపతిలోని ప్రభుత్వ మెటర్నటీ ఆస్పత్రికి వస్తున్న ప్రతి 100 మంది మహిళల్లో దాదాపు 70 నుంచి 80 శాతం మంది మహిళలను రక్తహీనత వెంటాడుతోంది. ప్రసవం సమయంలో అవసరానికి సరిపడా రక్తమూ దొరకడం లేదని సాక్షాత్తూ అక్కడి వైద్యులే చెబుతున్నారు. రక్తం కోసం తిరుపతి రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, వివి మహల్ రోడ్డులోని ప్రైవేటు బ్లడ్‌బ్యాంకుల నుంచి ప్రతిరోజూ 150 నుంచి 200 యూనిట్లు వరకు తీసుకెళుతుండటం గమనార్హం. అలాగే హైరిస్కు ఉన్నటువంటి వారిపట్ల నిత్యం ఎప్పటికప్పుడు పర్యవేక్షించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందంటూ ప్రముఖ వైద్యురాలు కృష్ణప్రశాంతి పేర్కొంటున్నారు. ప్రసవానికి 9 నెలలు ఉన్నప్పటికీ ఈలోపు అందాల్సిన పౌష్టికాహారాన్ని అంది వ్వగలిగితే రక్తహీనతను నివారించవచ్చని ఆ దిశగా అటు ప్రభుత్వం, ఇటు సమాజమూ ఆలోచించాలని హితవు పలికారు. వీటిపై తిరుపతి వైద్య, ఆరోగ్యశాఖాధికారిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించక పోవడం గమనార్హం.

ప్రభుత్వ అలసత్వం, పోషకాహార

2 లో

తిరుపతి సీటు కోసం...

'జనసేన' లోకి 'జంపింగ్'

ఆరణి x సుగుణమ్మ / పసుపులేటి, కిరణ్‌రాయల్ గుర్రు

జనసేనలోకి ఆరణి శ్రీనివాస్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

జనసేన, టిడిపి పొత్తులో భాగంగా తిరుపతి సీటును జనసేనకు పక్కాగా ఇస్తారని తెలుస్తోంది. అయితే ఈ పార్టీలో ఉంటే తమకు భవిష్యత్ ఉండదని ఎంఎల్‌ఎ సీటు కోసం జనసేన తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమయ్యారు. చిత్తూరు సిట్టింగ్ ఎంఎల్‌ఎ వైసిపికి రాజీనామా చేసి మంగళగిరిలో జనసేన కార్యాలయంలో గురువారం కండువా కప్పుకున్నారు. తిరుపతి టిడిపి మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ ఎంఎల్‌ఎ అభ్యర్థిత్వం కోసం సైకిల్ దిగి జనసేన తీర్థం పుచ్చుకోవాలని ప్రయత్నం చేసినా టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు సర్దుబాటు చేశారు. పార్టీలోనే ఉంటే మంచి భవిష్యత్ ఉంటుందని సర్దిచెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఆరణి శ్రీనివాస్ స్థానికేతరుడని, తాను లోకల్ అని, తన భర్త వెంకటరమణ తిరుపతి ప్రజలకు ఎంతో సేవ చేశారని, గత ఎన్నికల్లో స్వల్ప మెజార్టీలో ఓటమిని చ చూసిన నేపథ్యంలో

2 లో

స్థలాలు చూపుతాం.. ఉత్తర్వులు ఇవ్వండి

ముగిసిన 36 గంటల నిరసన దీక్ష

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

మంగళం పరిధిలో జగనన్న ఇంటి పట్టాలు పొందిన వారికి స్థలాలు ఉంటే చూపమని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చెప్పారని, స్థలాలు తాము చూపిస్తామని, అనుమతి ఉత్తర్వులను ఇవ్వాలని సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో జగనన్న ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులకు స్థానికంగా ఉన్న తుడా క్వార్టర్స్ వద్ద ఉన్న స్థలంలో ఇళ్ల స్థలాలు

2 లో

తరువాయి

భవిష్యత్ 'బక్క'చిక్కుతోంది..!

పంపిణీలో చోటుచేసుకుంటున్న లోపాల వల్ల ఎనీమియా తీవ్రరూపం దాల్చుతోంది. గుడ్లు, బాలామతం , పాలు ఇతర పోషకాహార లోపంతో చిన్నారుల్లో 60 నుంచి 70 శాతం, మహిళల్లో 50 నుంచి 60 శాతం, గర్భిణీల్లో 70 నుంచి 80 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారని సర్వేలు చెబుతున్నాయి. గర్భిణులు, బాలింతలు, అప్పుడే పుట్టిన నవజాత శిశువులు సైతం రక్తహీనతతో నీరసంగా ఉండటం, బరువు తక్కువుండటం, ఎత్తు పెరగకపోవడం, దేహం పాలిపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. దీంతో భవిష్యత్ తరాల ఆరోగ్యంపై ఎఫెక్ట్ పడుతోంది. 2.5 కిలోల బరువుతో పుట్టాల్సిన శిశువులు చాలా బలహీనంగా ఉండి పురిట్లోనే కన్నుమూస్తున్నారు. రక్తం లేక ప్రసవవేదన భరించలేక తల్లులు తనువు చాలిస్తున్నారు. ఇలా తిరుపతి మెటర్నటీ, రుయా చిన్నపిల్లల ఆసుపత్రుల్లో ప్రతి నెలా తరచూ 15 మంది 20 మంది మరణిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే రక్తహీనత నివారణ చర్యల్లో భాగంగా పాలు, గుడ్లు, బాలామృతం, న్యూట్రిషన్ కిట్లు, ఎండు ఖర్జూరం, ఐరన్ ఫోలిక్ మాత్రలు, సిరప్ ఇస్తున్నామని చెబుతున్నా ఆచరణలో మాత్రం బాధితులకు అందకపోవడం వల్లే సమస్య ఉత్పన్నమవుతున్నట్లు శ్రామిక మహిళా నేత ఆర్ లక్ష్మి పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరింత పూర్తిస్థాయి సర్వే నిర్వహించి బాధితులకు పౌష్టికాహారాన్ని అందించి భవిష్యత్ తరాలను కాపాడాలని ప్రజాసంఘాల నేతలు కోరుతుండటం గమనార్హం.

45 శాతం శిశువులకు ముర్రుపాలు దూరం

కళ్లు తెరవగానే తల్లి 'పాల'న కావాల్సిన బిడ్డలు అమ్మ చనుబాలకు దూరమవుతున్నారు. పుట్టగానే తల్లిపొత్తిల్లో ఒదిగి ముర్రుపాలు తాగాల్సిన బిడ్డలు డబ్బాపాలు తాగుతున్నారు. దాదాపు 60 శాతం మంది పిల్లలు తల్లిపాలకు నోచుకోవడం లేదు. పుట్టిన వెంటనే ఇవ్వాల్సి ఉండగా రెండు మూడు రోజులు గడిచినా ఇవ్వడం లేదు. బిడ్డకు మొదటి ఆరునెలల వరకు తల్లిపాలు తాగుతున్న వారు కేవలం 46 శాతమే. ప్రతి ఏడాదీ కోట్లల్లో డబ్బాపాల వ్యాపారం జరుగుతోంది. ఉద్యోగం చేసే మరి కొందరు తల్లులు మొదటి ఆరు నెలలు తల్లిపాలు సంపూర్ణంగా ఇవ్వలేకపోతున్నారని పేర్కొంటున్నారు.పుట్టిన గంటలోపు తల్లిపాలు ఇస్తే బిడ్డకు రోగ నిరోధక శక్తి ఏర్పడుతుందని తిరుపతి రుయా వైద్యురాలు అరుణ పేర్కొంటున్నారు. చిక్కగా పుసుపు రంగులో ఉండే ముర్రుపాలలో కొలోస్ట్రమ్ ఉంటుందని చెబుతున్నారు. ముర్రుపాలను కొందరు పిండిపారపోస్తారని, అది సరైనది కాదని వైద్యులు అంటున్నారు. తిరుపతిలో ఇటీవల ఓ స్వచ్ఛంధ సంస్థ నిర్వహించిన సర్వేలో కేవలం 60 శాతం మాత్రమే పుట్టిన గంటలోపు తల్లిపాలు తాగుతున్నట్లు తేలింది. అయితే వైద్యుల అంచనా ప్రకారం 36 శాతమే మాత్రమే చిన్నారులు ముర్రుపాలకు నోచుకుంటున్నట్లు స్పష్టం చేస్తున్నారు. మహిళల్లో రొమ్ముక్యాన్సర్ పెరగడానికి తల్లిపాలు ఇవ్వకపోవడమేనని వైద్యులు పేర్కొంటున్నారు. సిజేరియన్ కారణంగా తల్లి ఐసియులో ఉంటే, బిడ్డ ఇంక్యుబేటర్‌లో ఉంటున్నారు. ఈ కారణంగానూ రెండు మూడు రోజుల వరకూ పిల్లలు తల్లిపాలకు నోచుకోవడం లేదని వైద్యులు చెబుతున్నారు.

రెండేళ్లపాటు తల్లిపాలే ఇవ్వాలి : డాక్టర్ ఈశ్వరయ్య, ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు, రుయా ఆసుపత్రి, తిరుపతి

పుట్టిన బిడ్డకు రెండేళ్లపాటు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలి. బిడ్డ పుట్టగానే చుక్కపాలు కూడా వృధా చేయకుండా వెంటనే ఇవ్వాలి. మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు తప్ప ఆవు, బర్రె, డబ్బాపాలనూ ఇవ్వొద్దు. ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకు తల్లిపాలతో పాటు ఇంట్లో తయారు చేసిన తేలికపాటి ఆహారం ఇవ్వాలి. పాలను పిల్లలకు వ్యాక్సిన్‌గా ఇవ్వాలి. పాలు ఇవ్వడం వల్ల అది వారికి రక్షగా ఉంటుంది. పాలు తాగిన పిల్లలకు 500 కేలరీల శక్తి వస్తుంది. చాలామంది అపోహతో బిడ్డకు పాలు ఇవ్వడం లేదు. తల్లిపాలు తాగే బిడ్డ పుట్టిన సమయంలో ఉండే బరువు, అయిదు నెలల వయస్సు వచ్చేసరికి రెట్టింపు, ఏడాదికి మూడు రెట్లు బరువు పెరుగుతారు.

స్థానికులకే సీటు ఇవ్వాలి : ఆర్కాట్ కృష్ణప్రసాద్

తిరుపతి టౌన్ : జనసేన, టిడిపి ఉమ్మడి అభ్యర్థిగా స్థానికేతరులను ప్రకటించే అవకాశం ఉందని చర్చ నడుస్తున్న నేపథ్యంలో 'స్థానికులకే' సీటు ఇవ్వాలని బలిజసేన రాష్ట్రాధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ అన్నారు. తిరుపతి అసెంబ్లీ సీటుకు ప్రాముఖ్యత ఉందన్నారు. ఉదయ్ ఇంటర్నేషనల్ హోటల్లో విలేకరుల సమావేశంలో క్రికెట్ విజయ్, డాక్టర్ కరుణానిధి, బెల్లంకొండ సురేష్, నాగరాజ రాయల్ పాల్గొన్నారు.

తుమ్మలగుంట బాధితులకు న్యాయం జరిగేవరకూ పోరాటం : అఖిలపక్షం

ప్రజాశక్తి - రామచంద్రాపురం

అఖిలపక్షం రౌండ్‌టేబుల్ సమావేశం

తుమ్మలగుంటలో నిరుపేదలైన భూబాధితులకు న్యాయం జరిగేంత వరకూ అఖిలపక్షం అండగా ఉంటుందని వక్తలు ఉద్ఘాటించారు. మఠం నిర్వాహకులు తుమ్మలగుంటలో పేదల ఇళ్లను కూల్చిన ప్రాంతంలోనే గురువారం అఖిలపక్షం కమిటీ ఏర్పాటయ్యింది. ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షులు అంజయ్యను కన్వీనర్‌గా ఎంపిక చేశారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకూ పోరాటం చేయాలని తీర్మానం చేశారు. టిడిపి ఇన్‌ఛార్జి పులివర్తి నాని, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, మురళి, బిజెపి నాయకులు మేడసాని పురుషోత్తం నాయుడు, జనసేన నాయకులు దేవర మనోహర్, కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎటువంటి ముందస్తు నోటీసులు లేకుండా మఠం భూముల్లో అక్రమ కట్టడాలు ఉన్నాయన్న నెపంతో ఇళ్లను నేలమట్టం చేయడం దుర్మార్గమన్నారు. కూల్చిన చోటనే వారికి ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేఆరు. చంద్రగిరి ఎంఎల్ఎ ఎండోమెంట్ అధికారులతో కుమ్మక్కయ్యి మఠం భూములను ఇష్టానుసారం ఆక్రమించుకున్నారని విమరిశంచారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి పేరుపై ఏకంగా 32 ఎకరాల మఠం భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్నా ఎండోమెంట్ అధికారులు పట్టించుకోకుండా, పేదల ఇళ్లు కూల్చడం వెనుక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు.

గ్రామీణ విద్యార్థులకు టెక్నాలజీపై అవగాహన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

జాతీయ విద్యా విధానం (ఎన్ ఈ పి) 2020కి అనుగుణంగా గ్రామీణ పాఠశాల పిల్లలకు స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) పట్ల కేంద్ర ప్రభుత్వ విద్యార్థులకు తిరుపతిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి జిల్లాలోని 30 పాఠశాలలకు చెందిన 120 మంది విద్యార్థులు సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం విభాగాలలో 40మంది ఎంపిక చేసిన ప్రాజెక్టులలో వినూత్న నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వి.శేఖర్ మాట్లాడుతూ స్మైల్ ఫౌండేషన్ ఆదర్శప్రాయమైన పని చేస్తుందన్నారు. ప్రదర్శించిన ఎగ్జిబిషన్లు పిల్లల వినూత్న ఆలోచనలను ప్రదర్శిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద రెడ్డి, శివ శంకరయ్య, లక్ష్మీనారాయణ, భాను ప్రసాద్, ఎం ఈ ఓ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కొట్టేవారి జనసేన విజయరథాలు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రాష్ట్రంలో జనసేన, టిడిపి ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు తథ్యమని ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. గురువారం అలిపిరి వద్ద జనసేన ప్రచార రథాలను ప్రారంభించారు. జనసేన బలోపేతానికి, పార్టీ విజయానికి ఎన్‌ఆర్‌ఐ కొట్టే ఉదయ్ భాస్కర్ తన సొంత నిధులతో 30 ప్రచార రథాలను అందజేయడం అభినందనీయమన్నారు. వెంకట్రావు రథాల నిర్వహణ చూసుకుంటారన్నారు. ఆరణి శ్రీనివాసులు జనసేనలో చేరిన శుభసందర్భంగా ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, కీర్తన, ఆనంద్, బీగల అరుణ పాల్గొన్నారు.

బలిజలంటే సిఎం జగన్‌కు గిట్టదు : ఆరణి

బలిజ కులస్తులంటే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి గిట్టదని చిత్తూరు ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు విమర్శించారు. తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం అలిపిరి చేరుకున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ రెడ్డి కుల నేతలు వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌ను ఏడాది క్రితమే వదిలినా సస్పెండ్ చేయలేదన్నారు. తాను బలిజ వర్గానికి చెందిన వ్యక్తిననే తనను సస్పెండ్ చేశారన్నారు. వైసిపిలో బలిజలకు ప్రాధాన్యత లేదన్నారు. తిరుపతిలో పోటీ చేసే అంశం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఇష్టమని అన్నారు.

టిడిపి, జనసేనతోనే బీసీల అభివృద్ధి: రాజయ్య

ప్రజాశక్తి–తిరుపతి(మంగళం): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వెనుకబడిన తరగతుల ప్రజలందరికీ అభివద్ధి ఫలాలు చేరువ కావాలంటే రాష్ట్రంలో టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలని టిడిపి బీసీ నాయకుడు రాజయ్య అన్నారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల అభివద్ధి కోసం టిడిపి జనసేన ఉమ్మడి డిక్లరేషన్ ప్రకటించాయని, తద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీలకు ఎంతో మేలు జరిగే అవకాశం ఉందన్నారు. దీర్ఘకాలికంగా ఎదురుచూస్తున్న రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలన్న కల చంద్రబాబు, పవన్ పాలనలో నెరవేరుతుందని ఆశ భావం వ్యక్తం చేశారు.

వినాయక సాగర్ కంపు కంపు : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వినాయకసాగర్ శుభ్రత చేపట్టడంలో నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారులు చేతులెత్తేశారని, వారానికి ఒక్కసారైనా శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలని సిపిఎం నాయకులు కందారపు మురళి డిమాండ్ చేశారు. వినాయకసాగర్‌కు వాకింగ్ చేసేందుకు వచ్చేవారు, స్థానికులు, యాత్రికులు ముక్కు మూసుకునే పరిస్థితి ఉందని, వ్యర్థాలతో సాగర్ నిండి ఉందన్నారు. కొత్తగా వచ్చిన కమిషనర్ ఆదిత్య సింగ్ బాధ్యతలు స్వీకరించి నెలరోజులైనా ఇంతవరకూ వినాయకసాగర్‌ను సందర్శించలేదన్నారు. ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాల్సిన వినాయకసాగర్‌ను కార్పొరేషన్ అధికారులు గాలికొదిలేశారని విమర్శించారు.

రేపు షాదిమహల్ ప్రారంభం

ప్రజాశక్తి–తిరుపతి(మంగళం):

పేద ముస్లింల శుభకార్యాల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన నూతన షాది మహల్ ఫంక్షన్ హాల్, డైనింగ్ హాల్ ను శనివారం ప్రారంభిస్తున్నట్లు షాదీ మహల్ ఆహ్వాన కమిటీ చైర్మన్ గఫూర్, నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఇమామ్, ఖాదర్ భాషా తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నూతన షాది మహల్ లో 80 లక్షల రూపాయల నిధులతో ఫంక్షన్ హాల్, డైనింగ్ హాళ్లను సరికొత్తగా రూపొందించామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో తిరుపతి టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కాసిం, మైనారిటీ సెల్ జిల్లా కార్యదర్శి చాంద్ భాషా, ఇమ్రాన్ భాష, నిజాముద్దీన్, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

తరువాయి

'జనసేన' లోకి 'జంపింగ్'

ఖచ్చితంగా గెలిచి తీరుతానని సుగుణమ్మ మొండి పట్టు పట్టినట్లు సమాచారం.

ఇదిలా ఉండగా తిరుపతి జనసేనకు ఇస్తే తమ అధినేత పవన్‌కల్యాణ్ పోటీచేస్తే పర్లేదు గాని, ఎక్కడినుంచో వలసొచ్చి బరిలో దిగితే ఎలా? అని సీటు ఆశిస్తున్న పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్ గుర్రుమంటున్నట్లు తెలుస్తోంది. తిరుపతి ఓటర్లకు మాత్రం రెండు రోజుల క్రితం అభినయ్‌కు ఓటేస్తారా? పవన్‌కల్యాణ్‌కు ఓటేస్తారా? అని ఫోన్‌కాల్స్ వచ్చాయి. వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి భూమన అభినయ్ కూడా గడప గడపకూ వైసిపి కార్యక్రమంలో తాను పవన్‌కల్యాణ్‌లా స్టెప్పులు వేయలేనని, అభివృద్ధి చేస్తానని చెబుతూ ప్రచారం చేస్తూ వచ్చారు. సిట్టింగ్ ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాస్ మాత్రం తనకు తిరుపతి సీటు ఇవ్వాలని బలిజ సామాజికవర్గం ఎక్కువగా ఉన్నందున గెలుపు సునాయాసం అవుతుందని అధినేత పవన్‌కల్యాణ్‌ను కోరి కండువా కప్పుకున్నారని తెలుస్తోంది.. టిడిపి సీటు ఆశిస్తున్న వూకా విజయకుమార్, జెబి శ్రీనివాస్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, నరసింహయాదవ్ మాత్రం సర్దుబాటులో సీటు జనసేనకు వెళితే వారికి శృంగభంగమే.

స్థలాలు చూపుతాం.. ఉత్తర్వులు ఇవ్వండి

చూపాలని కోరుతూ సిపిఎం, ఇళ్ల స్థలాల సాధన కమిటీ నిర్వహించిన 36 గంటల నిరసన దీక్ష గురువారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఎం తిరుపతి నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె. వేణుగోపాల్ మాట్లాడుతూ మంగళంలో పట్టాలు పొందిన స్థానికులకు స్థానికంగానే పట్టాలు ఇవ్వాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ వరకు వినతులు ఇచ్చామని, ఇదే క్రమంలో ప్రజా ప్రతినిధులకు కూడా స్థానిక ప్రజల ఆవేదనను తెలియపరచామన్నారు. చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్థానికుల సమస్యపై స్పందించకుంటే గుర్తించిన ప్రభుత్వ భూముల్లో జెండాలు పాతి ఇళ్ల నిర్మాణం చేపడతామని స్పష్టం చేశారు. గత 36 గంటలుగా నిరసన దీక్ష చేపట్టినా ప్రజా ప్రతినిధులు గాని, అధికారులు గానీ స్పందించకపోవడం దారుణమన్నారు. పేదవాడు జానెడు భూమి కోసం పాలకుల చుట్టూ తిరుగుతున్న పట్టించుకునే నాధుడే లేడన్నారు. ఉమ్మడి పంచాయతీలో ప్రభుత్వ, కాలువ కుంట పోరంబోకు భూములను యథేచ్ఛగా ఆక్రమించి అధికార పార్టీ నాయకులు లాభాలు అర్జిస్తున్నారన్నారు. కబ్జాల తంతు అంతా పత్రికల్లో సర్వే నంబర్లతో సహా ప్రచురితమవుతున్న రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం విస్మయాన్ని కలిగిస్తుందన్నారు. శివరాత్రి తరువాత ప్రభుత్వానికి రెండు రోజుల వ్యవధిని ఇస్తున్నామని, అప్పటికీ స్పందించకుంటే ప్రభుత్వ భూముల్లో జెండాలు పాతి ఇళ్ల నిర్మాణం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, జిల్లా కమిటీ సభ్యులు యన్ మాధవ్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి.బుజ్జి, చిన్న, బిటిఆర్ శాఖ కార్యదర్శి మునిరత్నం, బాధుల్లా, మొదిన్, హమీద్, వెంకటేష్ పాల్గొన్నారు.

కార్మికుల రిటైర్మెంట్ వయస్సు తగ్గించొద్దు : సిఐటియు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

శ్రీహరికోటలో రకరకాల పద్ధతులలో టెండర్ దక్కించుకుని ఆ తరువాత వేతనాలు తక్కువ ఇవ్వడం, కార్మికులను తొలగించడం జరుగుతోందని, సిఐటియు మండిపడింది. ఓరిల్ కంపెనీ తక్కువ కోట్ చేసి షార్, కాలనీ పారిశుధ్య కాంట్రాక్టు దక్కించుకొంది. కార్మికుల వయసు గరిష్టంగా 58గా నిర్ధారించి తొమ్మిది మందిని తీసుకునేందుకు నిరాకరించిందని తెలిపారు. ఈ మేరకు ఆర్డీవోకు సిఐటియు నాయకులు ఎస్.సాంబశివయ్య, కె.లక్ష్మయ్య, రమణరావు, మునెయ్య, శామ్యూల్, షార్ కార్మికులు వినతిపత్రం సమర్పించారు.

సీనియర్ ఇంటర్ పరీక్షకు 798 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన ఇంటర్మీడియట్ మ్యాథ్స్ 2ఏ పరీక్షలకు 798విద్యార్థులు గైరాహాజరయ్యారని ఆర్ఐఓ ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 28915మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా, 28117 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు. జనరల్ కోర్సులో 718, ఒకేషనల్ కోర్సులో 80మంది విద్యార్థులు పరీక్షలకు గైరహాజరయ్యారని వెల్లడించారు.

రామకృష్ణకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్: ఎస్వీయూలో వృక్షశాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి రామకృష్ణకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ యన్.సావిత్రమ్మ పర్యవేక్షణలో "స్టడీస్ ఆన్ సింథిసిస్ క్యారెక్టరైజెషన్ వాలిడేషన్ అండ్ అప్లికేషన్ ఆఫ్ నానో పార్టికల్స్ ఫ్రమ్ పైకస్ మొల్లిస్ వాహ్లా-ఏ మెడిసినల్ ప్లాంట్ స్పిసిస్" అనే అంశంపై పరిశోధన చేసి, పరిశోధనా గ్రంధాన్ని సమర్పించారు. ఈయన పరిశోధన వ్యాసాలు వివిధ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితం అయ్యాయి. వివిధ రంగాలలో అత్యధిక ప్రాముఖ్యతను సంతరిం చుకున్న నానో పార్టికల్స్‌ను జైవిక విధానంలో తయారు చేసి, మానవ బ్రేస్ట్ కాన్సర్ కణాలపై అత్యుత్తమ ఫలితాలను పొంది, కాన్సర్ నివాం´ణకు సరికొత్త మార్గాన్ని ఆవిష్కరించారు. ఈయన నేషనల్ సైన్స్ కాంగ్రెస్‌తో సహా పలు జాతీయ సెమినార్లు, వర్కుషాప్స్‌లో పాల్గొని ప్రసంగిం చారు. ప్రస్తుతం అనంతపురం జిల్లా గుంతకల్లు లో జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు.

వీ.ఎన్. సెంథిల్‌కూ..

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వియూ గణాంకశాస్త్ర (సాంఖ్యాక శాస్త్రము) విభాగం పరిశోధక విద్యార్థి వీ.ఎన్.సెంథిల్కి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్శిటీ పరీక్షల నియంత్రణ అధికారి దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. గణాంకశాస్త్ర (సాంఖ్యాకశాస్త్రము) విభాగం ఆచార్యులు బీ.సరోజమ్మ మార్గదర్శకత్వములో "రిగ్రెషన్ మోడల్స్ ఫర్ టైం సిరీస్ ఎనాలిసిస్ అండ్ ఫోరేకేస్టింగ్ మెథడ్స్ యూసింగ్ అట్మోమోన ఫేయరిక్ డేటా" అను అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. వీ.ఎన్. సెంథిల్కి డాక్టరేట్ డిగ్రీ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

వేలం పాటలో రూ.10లక్షల ఆదాయం

ప్రజాశక్తి-ఏర్పేడు: పాపానాయుడుపేట పంచాయతీలో గురువారం సర్పంచ్ లలిత కరుణాకర్ అధ్యక్షతన ప్రైవేట్ బస్టాండు, దినసరి కూర గాయల మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్ గదులను వేలం నిర్వహించారు. బస్టాండ్, దినసరి కూరగాయల మార్కెట్ రూ.2,37,900, షాపింగ్ కాంప్లెక్స్ రూ.7,61,400 వెరసి మొత్తం రూ. 999300ను పాట పాడడం జరిగినది.

మాజీ ఎంపీపీ మృతి

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మాజీ ఎంపీపీ బండారు మునిరత్నమ్మ(53) అనారోగ్యంతో మృతిచెందారు. మండలంలోని పెద్దపాలవేడు పంచాయతీ సప్తగిరి గిరిజన కాలనీలో ఆమె పార్థీవ దేహానికి మాజీ జడ్పీటీసీ సభ్యులు సునీత, సుధాకర్ నాయుడు నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

చంద్రబాబు సొంతూరులో సచివాలయానికి తాళం

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): మండలంలోని మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు సొంతూరులోని సచివాలయానికి టీడీపీ ఉపసర్పంచ్ సచివాలయానికి తాళాలు వేశారు. ఫిర్యాదు, సమస్యలు పట్టించుకోని సిబ్బంది ఎందుకని మండిపడ్డారు. కందులవారిపల్లి ఉపసర్పంచ్ రాకేష్‌చౌదరి, సర్పంచ్ భర్త గిరిలు మాట్లాడుతూ వైసిపి నాయకులు అక్రమంగా ఇసుక రవాణా చేస్తుంటే సచివాలయ సిబ్బందికి ఫిర్యాదు చేసినా అరికట్టలేని సచివాలయ సిబ్బంది ఎందుకని..? ప్రశ్నించారు. అందుకు గానూ గురువారం సచివాలయానికి తాళాలు వేసి నిరసన వ్యక్తం చేసినట్లు చెప్పారు. భీమవరం, కొండ్రెడ్డికండిగ, కందులవారిపల్లి, శేషాపురం గ్రామాల నుండి వైసిపి నాయకులు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని, ప్రజాప్రతినిధులకు, మండల ఉన్నతాధికారులకు, సచివాలయ సిబ్బందికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాల్సిన సచివాలయ సిబ్బంది కూడా ఇసుక మాఫియాకు సహకరిస్తున్నారని ఆవేదనతో సచివాలయానికి బీగాలు వేసామని వారు తెలిపారు.

కృష్ణమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి

ప్రజాశక్తి -సదుం: వైఎస్సార్‌సిపి రాష్ట్ర కార్యదర్శి పి. పెద్దిరెడ్డి తల్లి కృష్ణమ్మ (85) బుధవారం హఠాన్మరణం చెందారు. గురువారం ఆమె అంత్యక్రియలు గురువారం యర్రాతివారిపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణం, భూగర్భ, గనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి పాల్గొన్నారు. కృష్ణమ్మ ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన వెంట చిత్తూరు ఎంపి రెడ్డెప్ప, చిత్తూరు జెడ్పి చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, నాయుకులు పాల్గొన్నారు.

సమన్వయకర్తగా భాగ్యరాజ్ నియామకం

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: కాంగ్రెస్ మానవ హక్కుల విభాగం సమన్వయకర్తగా డా.ఎ.భాగ్యరాజ్ నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, మానవ హక్కుల పరిరక్షణకు పాటుపడుతానని చెప్పారు.

మద్యం పట్టివేత

ప్రజాశక్తి-గూడూరుటౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ రమేష్ పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులకు వివరాలను వెల్లడించారు. పట్టణంలోని కోర్టు సెంటర్ వద్దనున్న కూల్‌డ్రింక్ షాప్‌లో 152మద్యం బాటిళ్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కాగా దుకాణదారుడిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఎస్ఐ విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లను కొల్లగొట్టే దొంగ అరెస్ట్

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: రాత్రి పూట కాపు కాసి ఎన్నెన్నో కొల్లగొట్టే దొంగలు అదుపులోకి తీసుకున్నట్లు ఈస్ట్ డిఎస్పి సురేందర్ రెడ్డి తెలిపారు. స్థానిక అలిపిరి పోలీస్‌స్టేషన్లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అలిపిరి పోలీసులు సాధారణ తనిఖీల్లో భాగంగా కరకంబాడి రోడ్డులోని తిమ్మనాయుడుపాలెం బస్‌స్టాప్‌లో పోలీసులను చూసి ఓ వ్యక్తి పారిపోవడానికి ప్రయత్నించాడు. పోలీసులు అతని చాకచకంగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు విచారణలో అతను జీవకోన నవజీవన్ కాలనీకి చెందిన వరదరాజులు మని (30)గా వెల్లడైందన్నారు. ఇతను గతంలో కూడా అలిపిరి, తిరుచానూరు, ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో పలు నేరాలకు పాల్పడి జైలు జీవితం గడిపాడని తెలిపారు. నిందితుడు వద్ద నుంచి ఎనిమిది లక్షలు విలువచేసే 4కేసుల్లో చోరీ కాబడిన నగలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. పోలీసులను ఆయన అభినందించారు.

ట్రాక్టర్ లారీ ఢీ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: కాశీరాయి లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను లారీ ఢీకొనడంతో ట్రాక్టర్ డ్రైవర్‌కి గాయాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు కథనం మేరకు పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై చంద్రగిరి మండలం తొండవాడ హ్యాపీ డాబా సమీపంలో ముందు లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ని వెనకనుంచి లారీ ఢీకొంది. ఈ ఘటనలో ట్రాక్టర్‌లోని రాళ్లన్నీ రోడ్డుపై చిందర వందరుగా పడ్డాయి. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్‌కి గాయాలు కావడంతో స్థానికులు అంబులెన్స్ ద్వారా తిరుపతి ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

నిందితులు అరెస్టు

ప్రజాశక్తి- పుంగనూరు: కర్ణాటక మద్యం అక్రమంగా రవాణా చేస్తూ కొందరు యువకులు పోలీసులకు పట్టుబడ్డారు. స్థానిక అర్బన్ సర్కిల్ కార్యాలయంలో గురువారం పలమనేరు డిఎస్‌పి మహేశ్వర్ రెడ్డి విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పుంగనూరు పట్టణం తూర్పు మొగసాలకు చెందిన రాజేష్, వెంకటరత్నం, బి అజయ్, సింగరిగుంట గ్రామానికి చెందిన నారాయణస్వామి నలుగురు జల్సాలకు, విలాసాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలని ఆలోచనతో కర్ణాటక రాష్ట్రం తక్కువ రేటుకు మద్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా రవాణా చేసేవారని తెలిపారు. ముందుగా అందిన సమాచారం చేరకు వీరిని అదుపులోకి తీసుకోవడంతోపాటు వారి నుంచి కర్ణాటక మద్యం, కారు ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం వారిని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. సీఐ రాఘవరెడ్డి, సిబ్బంది రెడ్డప్ప, ఎల్లప్ప, చిన్న రెడ్డప్ప, ప్రకాష్‌లకు జిల్లా ఎస్పీ ప్రశంసించారు.

శ్రీ కామాక్షీ సమేత శ్రీ లింగేశ్వరస్వామి దేవాలయం,
సూరిశెట్టిపాళెం (గ్రా), కోట (మం), తిరుపతి జిల్లా.

e-procurement Tender
NIT NO.P/COE/268/2024-28, Dt:22.02.2024
ప్రహరీగోడ నిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
ఇట్లు : ధర్మకర్త

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE - CUM- JUDICIAL FIRST CLASS MAGISTRATE, PUTTUR
I.A. No.3103 / 2022
O.S. No. 395 / 2022

Between :
K. Rajani and others ....Petitioners/Plaiantiffs
And
S. Mohan Rao and others .....Respondents/ Defenedants

NOTICE TO THE RESPONDENTS/ DEFENDANTS NO.1 TO 3 :
R1 : S. Mohan Rao, S/o Late S. Chenchu Ramaiah
R2 : S. Ananda Babu, S/o Late Kalappa,
R3 : S. Jagadeesh, S/o Late Kalappa,
Respondents/ Defenedants No.1 to 3 are residing at D.No. 17-379/2B , Korlagunta, Maruthi Nagar, Tirupati, Tirupathi Dist. A.P.
Please take notice that, the petitioners/plaintiffs filed suit for partition along with above Interlocutory application for permanent injuction in the above Hon'ble court against you and others and the above suit is posted to 13/03/2024 for your appearance. So, please to be attend on 13/03/2024 at 10.30 A.M. before the above Hon'ble court either in person or through your advocate, failing which the matter will be decided exparte against you on your absence.
This is the order of the above Hon'ble court.
Sd/- N. MURUGESHAN REDDY,
ADVOCATE, PUTTUR.

వందనాలమ్మా..!

మనో నిబ్బరంతో ముందడుగు

మనో నిబ్బరంతో మహిళ ముందడుగు వేస్తోంది.. సమాజంలో సగం పాత్ర పోషించేందుకు ప్రతి రంగంలోనూ పోటీ పడుతోంది. ఉత్పత్తి రంగంలో కీలకంగా మారింది.. కుటుంబ బాధ్యతను చూస్తూనే, సమాజంలో రెండో పౌరురాలిగా తన వంతు కర్తవ్యాన్ని నెరవేరుస్తోంది. గృహహింసను, వేధింపులను ఎదురొడ్డి ఆత్మన్యూనతా భావం నుంచి బయటపడి ధైర్యంగా ఎదుర్కొంటున్నారు. అణచివేతను, లింగ వివక్షను ప్రశ్నిస్తున్నారు. టిటిడిలో మహిళా క్షురకులను నియమించేందుకు పోరాడారు.. హాకీ క్రీడాకారిణిగా రాణించారు.. మురికివాడల అభివృద్ధికి శ్రమిస్తున్నారు. గృహ హింస తట్టుకుని సమాజంలో తలెత్తుకుని బతకాలనుకుంటున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో వివిధ రంగాల్లో సేవలందిస్తూ లింగ వివక్షను ప్రశ్నిస్తున్న వారి సక్సెస్ స్టోరీలు పాఠకుల కోసం.. ప్రజాశక్తి - తిరుపతి డెస్క్, టౌన్, సిటి, (మంగళం)



మురికివాడల్లో తహసీనుసా బేగం

మహిళలు వంటింటికే పరిమితం కావాలని, అందునా ముస్లీం మహిళలు 'బురఖా'మాటునే ఉండాలని సనాతన ధర్మం నొక్కి చెబుతోంది. అయితే మురికివాడల్లో పిల్లలకు తల్లిలా, సోదరిలా సేవలందిస్తోంది. ఆమె 'వియ్ సపోర్టు ఛారిటబుల్ ట్రస్టు' నిర్వాహకురాలు తహసున్నీసా బేగం. మహిళలకు సమాన హక్కులు రావాలంటే విద్య ఒక్కటే మార్గమని నమ్మారు. మురికివాడల్లో బాలికలకు పాఠ్యపుస్తకాలు అందిస్తూ, ఉచితంగా చదువు చెబుతున్నారు. చదువు పట్ల ఆసక్తిని పెంచి వారి వయస్సును బట్టి స్కూళ్లల్లో చేర్పిస్తున్నారు. ప్రతి ఆదివారం మురికివాడల్లో ఉంటున్న పిల్లలకు చదువు నేర్పిస్తున్నారు. తహసున్నీసా బిఎస్‌సి నర్సింగ్ చేశారు. తెలంగాణా రాష్ట్రం గద్వాల్ జిల్లా, మానపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో స్టాఫ్ నర్సుగా ఉద్యోగం వచ్చింది. ఆ తర్వాత కమిషన్ ఆన్ గ్రాడ్యుయేట్స్ ఆఫ్ ఫారిన్ నర్సింగ్ స్కూల్స్ (సీజీఎఫ్ఎన్ఎస్) కోర్సు చేసింది. అమెరికా వెళ్లాలనుకున్నారు. కుదరకపోవడంతో ఎమ్ఎస్సీ నర్సింగ్ సైకియాట్రీ కోర్సులో చేరింది. ఏడాది పూర్తయ్యేసరికి పునరాలోచనలో వడి కుటుంబ అవసరాల కోసం గహిణిగా ఇంటికే పరిమితం అయ్యింది. కొడుక్కి తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజ్లో లో సీటు రావడంతో తిరుపతికి వచ్చి స్థిరపడ్డారు. చదువు మీదున్న ఆసక్తిని సేవా కార్యక్రమాల వైపు మళ్లించి ఆదర్శంగా నిలిచారు. సావిత్రీ పూలే అవార్డును అందుకున్నారు. జీతంలో కొంత భాగం పేదవారికి ఇవ్వడం అమ్మానాన్న, అమ్మమ్మ నుంచి నేర్చుకున్నారు. పిల్లలు ఉద్యోగరీత్యా సెటిలయ్యారు. ఒక్కపూట కూడా అన్నానికి నోచుకోని కాలనీలను చూసి, చలించి వాళ్లకు రోజూ అన్నం పెట్టడం, పిల్లల బాగోగులు అడిగి తెలుసుకోవడం అలవాటయ్యింది. బ్రష్, పేస్ట్, సబ్బు కూడా తెలియని బాల్యం వాళ్లది. స్కూల్లో పేరుంటుంది కాని, స్కూలుకు పోరు. వారిని చూసి 'వియ్ సపోర్టు' అంటూ సేవ చేయడం ప్రారంభించాను. మొదట అన్నారావు సర్కిల్ ఎస్టీ కాలనీతో మొదలు పెట్టాను. రోజూ కాలనీకి వెళ్లడం బ్రష్ చేయమని, స్నానం చేసి రమ్మని చెప్పడం నేర్పించాను. పాఠాలను కంఠతా పట్టడం, చదవడం, రాయడం నేర్పిస్తున్నాను. చదవగలిగిన క్లాసులో చేర్పిస్తున్నాను. ఈ యజ్ఞంలో నన్ను చూసి నా స్నేహితులు ముందుకు వచ్చి పాఠాలు చెబుతున్నారు. తిరుపతి టౌన్

'వివక్ష'ను ప్రశ్నించిన రాధాదేవి

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమలలో శ్రీవారి ఆలయం వద్ద మహిళా భక్తులకు పురుషులు ఎందుకు తలనీలాలు తీయాలన్న ఆలోచన ఓ వైపు... మరో వైపు ఎటువంటి ఆదాయ వనరులు లేకుండా వంటింటికే పరిమితమైన మహిళలు మరోవైపు.. అదే రాధాదేవి ఆలోచనకు పదును పెట్టారు.. శ్రీవారి చెంత 'లింగ' వివక్ష ఆమెను నిద్రపోనీయలేదు. తలనీలాలు మహిళలు ఎందుకు తీయకూడదనుకున్నారు.. అనుకున్నదే తడవుగా కార్యరూపం దాల్చారు. మొదట తాను తీయడం నేర్చుకున్నారు.. ఆ తరువాత చుట్టుపక్కల మహిళలకు నేర్పించారు. తాము కూడా శ్రీవారి చెంత మొక్కు తీర్చుకునే భక్తుల తలనీలాలు తీస్తామని పట్టుబట్టారు.. పోరాడారు.. గెలిచారు.. మహిళా క్షురకుల వ్యవస్థాపకురాలిగా 'శ్రీవారి' చెంత గుర్తింపు పొందారు.. రాధాదేవి సక్సెస్ స్టోరీ ఎందరికో స్ఫూర్తిదాయకం.

వేల సంవత్సరాల ఘన చరిత్ర కల్గిన టిటిడిలో మహిళకు గుండు కొట్టేందుకు మహిళా క్షురకులను ఎందుకు నియమించకూడదని ఆలోచించి, ఆ దిశగా పోరాటం చేపట్టారు. 2004లో టిటిడికి ఆమె ప్రతిపాదన పంపారు. దీనిపై పురుష క్షురకులే అడ్డుపడ్డారు. అయినా ఆమె వెనకడుగు వేయలేదు. వామపక్ష నాయకుల స్ఫూర్తితో, వారి సహకారంతో ఉద్యమాన్ని ఉధృతం చేశారు. ఎట్టకేలకు 2006, మార్చి 3న కల్యాణకట్టలో మహిళా క్షురకులను తీసుకుంటామని టిటిడి బోర్డు సమావేశంలో ప్రకటించింది. కానీ అప్పటికే పురష క్షురకులు కోర్టును ఆశ్రయించి, దీనిపై స్టే తేవడంతో టిటిడి తమ ప్రతిపాదనలను మూడు నెలలు తిరకుండాన్నే జూలైలో విరమించుకుంది. అయినా ఆమె వెనుకంజ వేయలేదు. హైకోర్టులో ఉన్న కేసులో తనను కూడా ఇంప్లీడ్ చేయాలని కోరి, కోర్టులో తమ వాదనను వినిపించడంతో కోర్టు సైతం మహిళ క్షురకులను నియమించడం అవసరమని, అది వారి హక్కు అని తీర్పు ఇచ్చింది. వారిలో 2006 సెప్టెంబరు 23న 20 మంది మహిళా క్షురకులను విధుల్లోకి తీసుకోవడంతో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమయ్యింది. దీంతో పాటు భద్రాచలం, యాదగిరి గుట్ట, శ్రీశైలం, తమిళనాడులోని తిరుత్తణితో పాటు అన్ని సుబ్రమణ్యస్వామి ఆలయాలు, గుండుకొట్టే అన్ని ఆలయాల్లో మహిళా క్షురకులను నియమించారు. తిరుపతి సిటి

హాకీ క్రీడాకారిణిగా రజని రాణింపు

ఆ ఊరు అప్పటి దాకా ఆ మండలానికి కూడా అంతగా పరిచయం లేదు. దట్టమైన అటవీ ప్రాంతానికి ఆనుకొని ఉంటుంది. పొద్దు పొడిచింది మొదలుకొని చమటకష్టంతో బతుకెళ్లదీసే వారే అక్కడంతా. ఓ సాధారణ వడ్రంగి కుటుంబంలో జన్మించిన అమ్మాయి ఆ కుగ్రామాన్ని ఇప్పుడు ప్రపంచానికే పరిచయం చేసింది. ఎల్లలు దాటి ఆపై దేశం దాటి అంతర్జాతీయ స్థాయిలో పల్లెతో పాటుగా దేశం గర్వించే అసాధారణ ఖ్యాతిని తీసుకొచ్చి తెలుగింట ఆణిముత్యంలా మెరిసింది. దక్షిణ భారత దేశంలోనే భారత జట్టు తరపు ఏకైక హాకీ క్రీడాకారిణిగా రజని గుర్తింపు తెచ్చుకుంది. మహిళా దినోత్సవం సందర్భంగా దేశానికే కీర్తి తెచ్చిన ఆ మట్టిలో మాణిక్యం ప్రతిభను చర్చించుకోక తప్పదు.

తిరుపతి జిల్లా యర్రావారిపాళ్యం మండలం కమళ్ల గ్రామం యనమలవారికి పల్లెకు చెందిన రమణాచ్చారి, తులసి దంపతుల రెండవ కుమార్తె రజిని. 20దశాబ్దాలుగా హాకీ క్రీడా పోటీలో రాణిస్తోంది. నెరబైలు పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నపుడు అక్కడి పీఇటి మాస్టర్ విద్యార్థులకు హాకీ నేర్పడం ప్రారంభించారు. రజని ఆసక్తి, ఆటతీరును గుర్తించిన వెంకటరాజు మాస్టర్ ప్రోత్సహించి నైపుణ్యాన్ని నేర్పించారు. 2004లోనే పుత్తూరులో జోనల్స్‌లో తన జట్టు తరపున కీలకంగా వ్యవహరించి రన్నర్స్‌గా నిలిచారు. అప్పటి నుంచి రజిన బరిలో ఉందంటే ప్రత్యర్థులకు హడలే. వరుస విజయాలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రస్తానం కొనసాగిస్తూనే ఉంది. 2016లో ఒలంపిక్ అర్హత సాధించారు. మగరాయుడులా హాకీ ఆడుతోందని గేలిచేసిన వారే ఉన్నత స్థితికి చేరుకున్న రజనీని శభాష్ అని సన్మానిస్తున్నారు. ఓ ఇంటర్వ్యూ సందర్భంగా వెంకటరాజు మాస్టర్, తిరుపతిలోని హాకీ కోచ్ ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రోత్సాహం వల్లనే హాకీలో రాణిస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుపతి డెస్క్

తలవంచిన చోటే తలెత్తుకోవాలని..!

లక్ష్యం దిశగా భువన అలుపెరుగని కష్టం

స్టాఫ్ నర్సు కావాలన్నది ఆమె లక్ష్యం.. పెళ్లయినా చదివిస్తానని ప్రేమికుడు చెప్పిన మాటలు నమ్మి పెళ్లి చేసుకుంది.. పెళ్లయ్యాక తెలిసింది భర్త నిజ స్వరూపం.. ఆడదంటే అంగడి బొమ్మతో సమానంగా చూసే భర్తకు అక్రమ సంబంధాలు ఉన్నాయని తెలిసి కుమిలిపోయింది.. తల్లి మంచిది కాదని పిల్లల్ని తన దగ్గర నుంచి వేరుచేయడంతో కన్నపేగు తల్లడిల్లిపోయింది.. ఎనిమిదేళ్లు హింసను భరించింది.. 28 ఏళ్లకే ప్రేమ, పెళ్లి, పిల్లలు అన్నీ చూసేసింది.. అయితే తన లక్ష్యం మాత్రం చేరుకోలేకపోయింది.. ఆమె భువనచంద్ర.. తిరుపతి జిల్లా సత్యవేడు నివాసి.. ప్రస్తుతం ఆమె లక్ష్యం ఒక్కటే.. తలవంచిన చోటనే తలెత్తుకుని బతకాలని.. గడియారం కన్నా వేగంగా పనిచేస్తూ ఎప్పటికైనా సత్యవేడులో స్టాఫ్ నర్సుగా వెళ్లాలన్నది ఆమె చిరకాల కోరిక.. అందుకే శ్రమిస్తోంది.. అంతులేని కష్టాన్ని లక్ష్యంపై ఉన్న ఇష్టంతో చేస్తోంది.

నేను బాగున్నానని తల్లిదండ్రులకు చెప్పాలనిపించి

నా తల్లిదండ్రులు నాపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పిచ్చిదాన్నయిపోతానని భయపడ్డారు. స్టాఫ్ నర్సు కోసం కృషి చేస్తూనే, కన్నబిడ్డలను హాస్టల్లో చదివిస్తున్నారని తెలిసి దూరం నుంచే చూసుకుని వస్తున్నా. నేను పిల్లల్ని ఎత్తుకెళ్లేదానన్ని నా భర్త క్రియేట్ చేశాడు. కోర్టు ద్వారా విడాకులు తీసుకున్నాను. నా జీవితం 28ఏళ్లకే అంతా ముగిసిపోయిందని నా తల్లిదండ్రులు అనుకున్నారు. అయితే జీవితం నాకు ఇపుడే ప్రారంభమైనట్లుగా ఉంది. నా తల్లిదండ్రులను సంతోషపెట్టాలనిపించింది. నేను ఎంతో ఆనందంగా ఉన్నానని చెప్పాలనిపించింది. చూడాలని ఉందని అమ్మానాన్నకు కబురు పంపాను. వారితో కలిసి రేణిగుంట విమానాశ్రయానికి వచ్చాను. విమానం ఎక్కిన మరుక్షణం నా తల్లిదండ్రుల కళ్లల్లో కన్నీళ్లు. ఆ క్షణం నేను మరువలేను. హైదరాబాద్ అంతా చూపించాను. నన్ను అవమానించిన ప్రాంతానికే స్టాఫ్ నర్సుగా వెళ్లి విధులు నిర్వహిస్తూ అక్కడే గర్వంగా బతకాలన్నది నా ఆకాంక్ష.. తలవంచిన చోటే తలెత్తుకుని బతికేలా ప్రతి బాధిత మహిళ మనోధైర్యంతో ముందడుగు వేయాలి. అదే మహిళా దినోత్సవం రోజు మహిళలకు నేను చెప్పే నా జీవిత సత్యం. తిరుపతి (మంగళం)


తల్లిదండ్రులతో భువన

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలు

చిత్తూరులో

తిరుపతి ఎల్ఐసిలో..


గూడూరులో

చిట్టమూరులో

ప్రజాశక్తి-పిచ్చాటూరు: మండలంలోని వేలూరు ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం కుప్పరాజు ఆధ్వర్యంలో ఎంఈవో హేమమాలిని అధ్యక్షతన పాఠశాల వంట సిబ్బంది మునెమ్మ, నాగభూషణం, స్కావెంజర్ అంజలమ్మ, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు మునిరత్నం, సంగీత, అంగన్వాడీ అయా ఆదిలక్ష్మమ్మలను ఘనంగా దుశ్శాలవులతో సత్కరించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుందరం, గురుప్రసాద్, నరేష్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చిట్టమూరు: మండలంలోని కొత్తగుంటలో టి.ఎం.ఆర్ పాఠశాలలో రెడ్ కలర్ డే సెలబ్రేషన్స్, ఫ్రీ ఉమెన్స్ డే సెలబ్రేషన్స్ జరిగాయి. విద్యార్థులంతా ఎరుపురంగు దుస్తులతో పాఠశాల ప్రాంగణమంతా రెడ్ కలర్ బెలూన్స్, కలర్ పేపర్స్‌తో అలంకరించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఫ్యాషన్ డ్రెస్సులతో క్యాట్‌వాక్, నాటికలు, డాన్సులు, గొప్ప మహిళల వేషధారణ వేశారు. డైరెక్టర్ విజయలక్ష్మి మహిళ టీచర్లందరినీ ఘనంగా సన్మానించారు.

గూడూరు టౌన్: గూడూరు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న మహిళ వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళలను గౌరవించడం మన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ షారీనా, డాక్టరు రేణుక దేవి, డాక్టర్ ప్రసునా, నర్సులు విజయ, విజయలక్ష్మి, డాక్టరు చంద్రహస్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరుటౌన్: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉంటు అన్ని రంగాల్లో రాణించాలని పుత్తూరు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి సి జానకి పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం మండల న్యాయ సేవ అధికారి సంస్థ ఆధ్వర్యంలో ముందస్తు స్థానిక ప్రభుత్వ బాలికల సంక్షేమ వసతి గృహములో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ అధికారి భాను, హరిప్రియ, జయసుధ, పాఠశాల ఉపాధ్యాయులు, న్యాయవాదులు పాల్గొన్నారు. అదేవిధంగా లైంగిక విద్య, శారీరిక శుభ్రత మీద అవగాహన కలిగి ఉండాలని కళాశాల వైద్య బృందం డాక్టర్ కళ్యాణి పేర్కొన్నారు, అంతర్జాతీయ మహిళా దినోత్సవం " సందర్భంగా.కె.కె.సి.హెూమియోపతి వైద్యకళాశాల అధ్వర్యంలో డా. బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల, గోపాలకృష్ణపురంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

క్యాంపస్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించకుని ఎస్వీయూలోని మహిళ అధ్యయన కేంద్రం, విస్తరణ కేంద్రం, శ్రీ పద్మావతి మహిళ అభ్యుదయ సంఘం, రోటరీ క్లబ్ వారి సమన్వయంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం వామనరావు భవన్లోని ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. పద్మనాభం మాట్లాడుతూ స్త్రీ లేనిదే సృష్టి లేదు. కుటుంబంలో స్థిరమైన అభివృద్ధి, జీవన నాణ్యతకు మహిళలు కీలకమన్నారు. అయినా కొన్ని సందర్భాలలో స్త్రీలు వివక్షకు గురి అవుతున్నారని వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఓ. మహమ్మద్ హుస్సేన్, గౌరవ అతిథిగా బివి.మురళీధర్ హాజరైయ్యారు. కార్యక్రమంలో సుజాత, సరస్వతి, రమణ, రాజరాజేశ్వరి, శ్రీలత కిషోరీ, జగదీశ్వరి, సునీత, వరలక్ష్మి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రుష్మ ఆధ్వర్యంలో వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణ శారద అధ్యక్షత వహించి మాట్లాడుతూ స్త్రీలకు సాధికారత, చదువు ద్వారా వస్తుందని కాబట్టి స్త్రీలందరూ విద్యావంతులు కావాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ప్రభాకర్ రావు మాట్లాడుతూ స్త్రీలు సాధికారత పూర్తిగా సాధించాలంటే, పురుషుల భాగస్వామ్యం చాలా అవసరమని, వారి ఆలోచనలో మార్పు రానంతవరకు స్త్రీ సాధికారత అసాధ్యమని అన్నారు. డాక్టర్ అరుణ, ప్రసన్న లతా, డాక్టర్ మంగళ గౌరీ, డాక్టర్ లావణ్య కుమారి, డాక్టర్ భక్షు, డాక్టర్ చంద్రబాబు, మునవర్, నాగేశ్వరరావు, సతీష్ కుమార్, డాక్టర్ బాబురావు పాల్గొన్నారు.

కార్వేటినగరం: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ దేశానికి ఆదర్శ మూర్తులుగా నిలవాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. గురువారం జాతీయ మహిళా దినోత్స వారోత్సవాలను వెలుగు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మహిళలుక ఊడా అన్ని రంగాల్లో ప్రవేశించి తమ సత్తాని సామర్థ్యాని చాటుతున్నారని అన్నారు. అనంతరం పలు రంగాల్లో ఆదర్శంగా నిలుస్తున్న మహిలను గుర్తించిన వారిని శాలువలతో ఘనంగా సన్మానించారు. ఏపీఓ విజయ కుమార్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరు: పట్టణంలోని మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ న్యాయమూర్తి పగడాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

చిత్తూరు అర్బన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పరిష్కరించుకొని గురువారం సాయంత్రం నగరపాలక కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మెప్మా పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. సీఎంఎం గోపి, సీఈవోలు, ఆర్పీలు, సహాయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాల్లో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సత్కరించారు. ఎంఈవో సాయిలీల, ఎంఈవో 2 సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయిలకు మెమెంటోలు అందించి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ సభ్యులు ప్రకాష్, సుబ్రహ్మణ్యం, బాబు, శ్రీనివాసులు, చైతన్యాచారి, మోహన్, షన్ముగం పాల్గొన్నారు.

సారంగపాణి కీర్తనలను జనబాహుళ్యంలోకి తీసుకెళ్లేందుకు కృషి: టీటీడీ ఛైర్మన్ భూమన


కార్యక్రమంలో మాట్లాడుతున్న టీటీడీ ఛైర్మన్

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీవేణుగోపాల స్వామివారిపై ప్రముఖ వాగ్గేయకారుడు శ్రీసారంగపాణి అద్భుతమైన కీర్తనలు రచించి, స్వరపరిచారని, మరుగునపడిన వాటిని జనబాహుళ్యంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి శ్వేత భవనంలో గురువారం సాయంత్రం ప్రముఖ సినీ సంగీత కళాకారిణి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డా. పి.సుశీలతో కలిసి ఛైర్మన్ నూతన సారంగపాణి ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీ సాయికృష్ణ యాచేంద్ర స్వరపరిచిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ద్విపద శ్రీభాగవతం సిడిని ఆవిష్కరించారు.

రాష్ట్రంలో అభివృద్ధి నిల్.. అప్పులు ఫుల్..: సుధారెడ్డి

సుధారెడ్డిని కలిసిన నాయకులు

ప్రజాశక్తి-రామచంద్రాపురం: వైసిపి ప్రభుత్వం పాలనలో రాష్ట్ర అభివృద్ధి నిల్.. అప్పులు ఫుల్.. అనే నినాదంతో పాలనను సీఎం జగన్మోహన్‌రెడ్డి సాగేస్తున్నారని పులివర్తి సుధారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని నెనూరు పంచాయతీలో టిడిపి సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ టిడిపి తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో తిరుమలరెడ్డి, జనార్ధన్‌చౌదరి, చిన్నబాబు, మధుసూదన్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, జాకీ, చంద్రమౌళిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవి, జయచంద్ర నాయుడు, చిరంజీవి, గిరి, ఉమాపతినాయుడు, రాఘవేంద్ర నాయుడు, సురేష్, రామ్మూర్తి, చంగయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: పట్టణంలోని స్థానిక పురపాలక సంఘం నూతన భవనాన్ని మంత్రి రోజా చేతులు మీదుగా గురువారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో సీఎం కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ కేఎల్ఎంఎన్ రెడ్డి, చైర్మన్ హరి, జయప్రకాష్, శంకర్, వనిత కార్తీక్, గోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కార్తీక్, హేమశేఖర్‌రెడ్డి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సద్వినియోగం

చేసుకోండి: ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, వైసీపీ నేత వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తి మండలం టీఎంవీకండ్రిగలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమానికి బాలాజీ ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజర య్యారు. కార్యక్రమంలో వైద్యులు రాహు ల్, సుబ్బలక్ష్మి, నాయకులు సురేంద్ర యాదవ్, యానాదిరెడ్డి, ఎల్లయ్య, కార్య దర్శి హేమశ్రీ, వలంటీర్లు పాల్గొన్నారు.

కూను బాజ్జికి నివాళి

ప్రజాశక్తి-బాలాయపల్లి: కూను బాజ్జి అంత్యక్రియల్లో మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి గురువారం పాల్గొన్నారు. బుధవారం చెట్టుపడి వైసీపీ కూను రామయ్య తమ్ముడు కూమారుడు బాబ్జీ వ్యవసాయ పొలం వద్ద చెట్టు పైన పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మాజీమంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి ఆయన అంత్యక్రియలకు పాల్గొని కుటుంబంని ఓదార్చారు. ఆమె వెంట మండల పార్టీ అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆదరించండి అభివృద్ధి చేస్తా..: గాలి భాను

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: ఆదరించి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని గాలిభాను అన్నారు. గురువారం వడమాలపేట మండలం ఎనమలపాళెంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గురవయ్య, నాగరాజు, రాజేష్, జనార్ధన్, ధన, యువరాజ్, సుబ్రమణ్యంరెడ్డి, పార్దు, వెంకటయ్య, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల తీరు దారుణం

- మునిసిపల్ ఆఫీస్ వద్ద ఎర్రగుట్ట గుడిసె వాసులు ధర్నా

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: గత నెల 27వ తారీఖున ఎర్రగుట్ట గుడిసె వాసులను ఉద్యేసించి సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ తిరుపతి పట్టణంలో ఉన్న 53వార్డుల ప్రజలకు జగనన్న పట్టా ఇచ్చి స్థలం చూపించకుండా పేదలకు కుంటి సాకులు చెపుతున్న తీరును ఖండించారు.అలాగే తిరుపతి చుట్టూ పక్కల భూములను వైసీపీ నాయకులు అక్రమంగా అమ్మేస్తుంటే మేయర్ చర్యలు తీసుకోకుండా ఉండటం ఏందని ప్రశ్నించడం జరిగిందితిరుపతి పేదలకు ఎక్కడో 35 కిలోమీటర్లు దూరంగా జగన్నా ఇల్లు ఇచ్చి స్థలం చూపకుండా నిర్లక్ష్యం చేస్తున్న పద్ధతి కరెక్ట్ కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా పేదలకు స్థలం ఇవ్వకపోవడంతో కరకంబాడి దగ్గర ఎర్రగుట్టలో ప్రభుత్వ భూమిలో దిగి గుడిసెలు వేసుకుంటే వాటిని అర్ధరాత్రి సమయంలో పేదలపై పోలీసు, రెవెన్యూ కలిసి దాడి చేసి గుడిసెలు తొలగించారు. ఖాళీ చేయించి పది రోజులు పూర్తవుతున్న ఎర్రగుట్ట గుడిసె వాసులకు స్థలం కేటాయిస్తామని గాని న్యాయం చేస్తామని గానీ ఇప్పటివరకు ఎందుకు ప్రకటించలేదని ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ప్రశ్నించింది.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: క్యాన్సర్‌పై అవగాహన ప్రతి ఒక్కరికి కలగాలి అని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. శెట్టిపల్లిలో సిమ్స్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌కి సంబంధించి ప్రతి ఒక్కరికి అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడం ద్వారా మొదట దశలోనే పూర్తిగా నయం చేసుకోవచ్చునన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మెడికల్ ఆఫీసర్లను ఆశా వర్కర్లని కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో శ్రీహరిరావు, శెట్టిపల్లి ఉపసర్పంచ్ రామకృష్ణ, మోహన్ దాము తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ మొక్కలు పెంచండి: యామిని

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: రైతులు పామ్ అయిల్ మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని ఉద్యానశాఖ అధికారి యామిని అన్నారు. గురువారం మండలంలోని కారణి గ్రామంలో పామాయిల్ తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. జోనల్ అధికారి మురళి, ఏరియా మేనేజర్ రాజేష్, క్లస్టర్ అఫిషర్ ఆనందబాబు, రైతులు సుబ్రమణ్యం, బాలాజి, శిఖామణి, మస్తాన్‌నాయుడు, శ్రీధర్ పాల్గొన్నారు.

ముగిసిన టెక్ ఫెస్ట్

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ " సెలెక్ట్రా 24" ముగిసింది. ఇంజినీరింగ్ కళాశాలలు తమ సాంకేతిక నైపుణ్యం, వినూత్న ఆలోచనలను ప్రదర్శించేందుకు కలిసి వచ్చాయి. కార్యక్రమంలో సాంకేతిక పేపర్ ప్రదర్శనలు, వర్క్‌షాప్, పోస్టర్ ప్రదర్శన, క్రాస్ వర్డ్స్, టెక్నికల్ చార్డ్స్, టెక్నికల్ వర్డ్ బిల్డ్, కోడింగ్ పోటీలు, పోటీలు, సవాళ్లు ఉన్నాయి. విద్యార్థులు అసాధారణమైన నైపుణ్యాలు, సృజనాత్మకతను ప్రదర్శించారు. వారు మాట్లాడుతూ టెక్‌ఫెస్ట్ ఈవెంట్‌లు శక్తి వనరులను ప్రసరింపజేసే తన జ్ఞాన పదాలను పంచుకోవడం ద్వారా వృత్తిపరంగా వారి జ్ఞానం, మేధో నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, నైపుణ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయని చెప్పారు.

ఆసరా చెక్కు పంపిణీ



ప్రజాశక్తి-ఏర్పేడు, రేణిగుంట: వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పేడులో ఎమ్మెల్యే మధుసుదన్‌రెడ్డి, రేణిగుంటలో ఆయన కుమార్తె పవిత్ర రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మహిళా సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

'విజయం' పాఠశాలలో ఘనంగా క్రీడోత్సవాలు

క్రీడా పోటీల్లో రాణించిన విద్యార్థులను అభినందిస్తున్న తేజోమూర్తి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: స్థానిక సుందర రాజపురం విజయం సీబీఎస్సీ పాఠశాలలో గురువారం ఘనంగా క్రీడోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఐరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోమల, కెసిఆర్ ఉన్నత పాఠశాల పిఈడి బాబు విచ్చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులచే మార్చి ఫాస్ట్, మార్చ్ డిల్, యోగా, కరాటే వంటి అనేక కార్యక్రమాలను నిర్వహించారు. విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలు ప్రశంసాపత్రాలను అందజేశారు.

వైభవోపేతంగా కళ్యాణ వెంకన్న రథోత్సవం

- భక్తి శ్రద్ధలతో రథాన్ని లాగిన భక్తులు

- నేడు చక్రస్నానం

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): శ్రీనివాస మంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజు గురువారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై అధిష్టింపజేసి బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలు, భక్త భజనలు, గోవింద నామస్మరణల మధ్య స్వామివారి రథోత్సవం ప్రారంభమైంది. స్వామి, అమ్మవార్లు రథంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. భక్తులు ధూప దీప నైవేద్యాలు, కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి అశ్వవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో సిఇ నాగేశ్వరావు, ఇఇలు ప్రసాద్, సుమతి, వేణుగోపాల్, డెప్యూటీ ఇఇలు హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం...

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం చక్రస్నానం కార్యక్రమం నిర్వహించినట్లు ప్రత్యేక ఉపకార్య నిర్వహణ అధికారి వరలక్ష్మి తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌కు శాస్త్రోక్తంగా చక్రస్నానం జరుగనుంది.

వికలాంగుల మహా గర్జనను జయప్రదం చేయండి

- ఇన్‌ఛార్జ్ వావిళ్ళ శివయ్య మాదిగ పిలుపు

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: ఈ నెల 9వ తేది అమరావతిలో జరగనున్న వికలాంగుల మహా గర్జనను జయప్రదం చేయాలని నగరి నియోజకవర్గం ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పి ఇన్‌ఛార్జ్ వావిళ్ళ శివయ్య మాదిగ పిలుపునిచ్చారు. నగరి మండలంలో పర్యటిస్తూ ఆయన మాట్లాడారు. హలో వికలాంగ, చలో అమరావతి, 9వ తేదీన శనివారం మధ్యాహ్నం 12 గంటలకు అమరావతిలో ఉన్న నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న గ్రౌండ్లో, వికలాంగుల మహా గర్జన జరుగుతుందన్నారు. వికలాంగుల ఆపద్బాంధవుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో వికలాంగులకు 3000 నుండి 6వేలకు పింఛన్ పెంచాలని, తొలగించిన 95వేల మందికి పింఛన్లు అందించాలని మొత్తం 21డిమాండ్లతో మహాగర్జన జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న వికలాంగులు, వితంతువులు, వృద్ధులు అమరావతికి తరలివచ్చి వికలాంగుల మహా గర్జనను జయప్రదం చేయగలరని కోరుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి, పడమలపేట మండలం అధ్యక్షుల తిత్తులూరు వెంకట హరిప్రసాద్ మాదిగ, ఉపాధ్యక్షులు పగ్రి గోవిందరాజు మాదిగ, వీహెచ్ పీఎస్ వడమాలపేట మండల ఇంచార్జ్ వెంకటేష్ యాదవ్‌లు పాల్గొన్నారు.

ఏసురత్నంకు నివాళి

ప్రజాశక్తి-పిచ్చాటూరు: మండలంలోని వేలూరుకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు ఏసురత్నం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చి యేసు రత్నం భౌతికకాయానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగరాజు, శేఖర్, రుకేష్ పాల్గొన్నారు.

పీసీ రాయల్‌కు అరుదైన అవార్డు

ప్రజాశక్తి-తిరుపతిసిటీ: కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ ఛైర్మన్ పిసి రాయల్ యునైటెడ్ నేషన్స్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. హైదరాబాదులోని టర్కీ కన్సలెంట్ సహకారంతో ఐక్యరాజ్యసమితి గ్లోబల్ పీస్ ఆధ్వర్యంలో ఆయనకు ఈ అవార్డు అందజేశారు. యుఎస్ఏ, టర్కీ, యుకె, యుఏఈ, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్ వంటి దేశాల దౌత్యవేతల సమక్షంలో అందజేశారు. ఆయనను పలువురు అభినందించారు.

'ఓటు' ప్రతి పౌరుడి హక్కు..

యువ ఓటర్లకు అవగాహన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఓటు ప్రతి పౌరుడు హక్కు, ఎన్నికల సమయంలో ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని శానిటరీ ఇన్స్పెక్టర్, స్వీప్ ఇంచార్జ్ చిన్నయ్య పిలుపునిచ్చారు. నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా గురువారం 18వ వార్డు సచివాలయంలో 'ఓటు హక్కు ఆవశ్యకత' అంశం సీనియర్ సిటిజన్స్ ద్వారా 18, 19 సంవత్సరాల యువ ఓటర్లకు అవగాహన కల్పించారు. ఆర్ఐ వెంకటేష్, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

హస్తకళల శిక్షణా కేంద్రాన్ని సందర్శించిన లేపాక్షి ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరులోని కళాకారులు మట్టితో తయారు చేసే వివిధ కళాకతులను మన దేశంతో పాటు ప్రపంచ దేశాలకు ఎగుమతి చేస్తున్నారన్నారు. గురువారం పలమనేరు పట్టణంలో ఉన్న హస్తకళాకారులకు ఆధునిక మట్టితో తయారు చేసే కళాకతుల ఆధునిక డిజైన్స్‌పై సుమారు 30మంది కళాకారులకు 5 నెలల పాటు శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) ఛైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదరి, ఆల్ ఇండియా వీవర్స్ పెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బడిగించల చంద్రమౌళి హాజరై మాట్లాడారు. పట్టణంలోని కళాకారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హస్తకళాకారులు తయారు చేసిన వస్తువులు కొనుగోలు చేసి, వారికి జీవనోపాధి కల్పించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం అక్కడి హస్తకళాకారులు తమ సమస్యలను ఛైర్‌పర్సన్ దష్టికి తెచ్చారు. నూతన చేతివత్తుల సహకార సంఘాన్ని ఏర్పాటు చేయించాలని కోరారు. బ్యాంకుల ద్వారా ముద్ర రుణాలు ఇప్పించాలని, గుర్తింపు కార్డులు ఇప్పించాలని, ఎగ్జిబిషన్‌లో వారు తయారు చేసిన వస్తువులను విక్రయించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అలాగే మట్టి రోలింగ్ చేసుకునేందుకు 6 మిషన్స్ ఇప్పించాలని కోరారు. తిరుపతి శ్రీనివాసం లేపాక్షి సిబ్బంది శ్రీధర్, వై.వీరాంజనేయులు, ప్రెసిడెంట్ రామకష్ణ, మాస్టర్ క్రాఫ్స్ మెన్ ఈశ్వరయ్య, డిజైనర్ జ్యోషి హస్తకళాకారులు పాల్గొన్నారు.

డయాలసిస్ వార్డు ప్రారంభించిన మంత్రి

ప్రజాశక్తి- నగరి: కిడ్నీ ఫెయిల్యూర్ రోగులకు డయాలసిస్ సౌకర్యాన్ని కల్పించేందుకు అవిశ్రాంత కషి చేసిన మంత్రి ఆర్కేరోజా నగరి ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ వార్డును ఏర్పాటు చేయించి గురువారం ప్రారంభించారు. వార్డులో ఏర్పాటు చేసిన 5 డయాలసిస్ యంత్రాలను పరిశీలించి స్విచ్ ఆన్‌చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డయాలసిస్ పేషంట్లకు డయాలసిస్ సౌకర్యాన్ని కల్పించడానికి 61 డయాలసిస్ సెంటర్లు నెలకొల్పుతున్నారని అన్నారు. వీటి ద్వారా 515 డయాలసిస్ పరికరాలు అందుబాటులోకి రానుంది. వీటి ద్వారా రాష్ట్రంలోని 10వేలకు పైగా కిడ్నీ బాధితుకు లబ్ది చేకూరనుందన్నారు. ఇందులో భాగంగా నగరి ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని రూ. 50లక్షల వ్యయంతో ఐదు డయాలసిస్ మెషిన్లను అమర్చామన్నారు. నగరి నియోజకవర్గంతో పాటు పరిసర నియోజకవర్గాల నుంచి సుమారు 500 పేషంట్లకు డయాలసిస్ వార్డు సేవలు అందించనున్నామని అన్నారు. మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, నగరి, నింద్ర ఎంపీపీలు భార్గవి, దీప, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి, ఆస్పత్రి కమిటీ డైరెక్టర్ కష్ణమూర్తి, డయాలసిస్ వింగ్ ఏపీ ఇన్‌చార్జ్ దిలీప్‌కుమార్, మున్సిపల్ వైస్‌ఛైర్మన్‌లు బాలన్, వెంకటరత్నం పాల్గొన్నారు.

కాలుష్య కోరల్లో కడివేడు

- చెరువులోకి కర్మాగారపు రసాయన వ్యర్థాలు
- విషవాయువుల వ్యాప్తితో గ్రామాలకు అంటుకుంటున్న వ్యాధులు
- రోగాల బారిన పడి ఇడ్డందులు తప్పడం లేదని రోదన
- పట్టించుకోని అధికారులు
- ఉన్నతాధికారులైనా స్పందించాలని వేడుకోలు

ప్రజాశక్తి-గూడూరుటౌన్: కార్మాగారాల్లో వినియోగించే అతి ప్రమాదకరమైన రసాయనపు వ్యర్థాలను చెరువులో పారబోస్తున్నారు. చిల్లకూరు మండలం కడివేడు గ్రామ పరిధిలోని చెరువులో 6ఏళ్లుగా ఇదే వ్యవహారం జరుగుతోంది. శ్రీసిటి, కృష్ణపట్నం పోర్టు నుంచి ఓ అధికారపార్టీ నేత అండదండలతో వ్యర్థాలను లారీల్లో తెచ్చి వదులుతున్నారు. ఫలితంగా అక్కడ విషవాయువులు అలుముకొని పరిసర ప్రాంత ప్రజలకు అంటువ్యాధులు, చర్మవాధులు ప్రభలుతున్నాయి. ఇదంతా తెలిసినా అధికారులు మాత్రం చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు, ప్రజాసంఘ నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు.

లారీల్లో బ్యారెల్స్ తరలింపు..

రసాయనపు వ్యర్థాలను పారబోసేందుకు ఆయా కార్మాగారాలు నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అలా కానీ పక్షంలో భారీ మొత్తంలో వారికి అపరాదం, కొన్నిసార్లు కేసులూ నమోదైయ్యే అవకాశం ఉంది. కానీ ఇక్కడ మాత్రం ఓ అధికార పార్టీ నేత అండదండలతో వారి అనుచరులు లారీల్లో భారీగా రసాయనపు వ్యర్థాలు తెచ్చి యథేచ్ఛగా నిబంధనలు విరుద్ధంగా చెరువులోకి వదిలేస్తున్నారు. సుమారు నెలకు 3సార్లు లారీకి వంద బ్యారెల్స్ చొప్పున అక్కడకు తరలించేస్తున్నారు. అక్కడ మేత పోరంబోకు భూముల్లో పెద్దగుంట తవ్విదానిలోంచి పంట కాలువ ద్వారా చెరువులోకి వదులుతున్నారు. వ్యర్థాలు తరలిస్తూనే ఆ నేతలు రూ.లక్షలు గడిస్తున్నట్లు స్థానికంగా విమర్శ.

అలుముకుంటున్న వ్యాధులు..

కడివేడు చెరువులోకి వదులుతున్న ఆ రసాయనపు వ్యర్థాల వల్ల విషవాయువులు ఏర్పడి గ్రామాల్లో ఇప్పటికే వ్యాధులు వ్యాపించాయి. 6ఏళ్లుగా ఆ గ్రామల్లో ఇదే విధంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అక్కడి స్థానికులు చెబుతున్నారు. ఆ చెరువులో నీరు త్రాగి ఇప్పటికే దాదాపు 20కి పూగా గెదెలు మృత్యువాతపడ్డట్లు ఆ గ్రామస్తులు చెబుతున్నారు. పైగా అక్కడి ప్రజలకు చర్మ, అంటు, ఇతర వ్యాధుల బారిన పడి అనారోగ్యం పాలవుతున్నట్లు వాపోతున్నారు. అక్కడి రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమస్యను తెలియజేసినప్పటికీ తూతూ మంత్రంగా తనిఖీ చేసి మిన్నకుండిపోయారని విమర్శ. అధికారులు చర్యలు లేకపోవడానికి కారణం అక్కడి అధికారపార్టీ నేతనే కారణంగా అక్కడి వారు ప్రధానంగా ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారాన్ని గుర్తించిన సీపీఎం పార్టీ బృందం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారులైనా స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తక్షణం చర్యలు చేపట్టాలి..

ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే చర్యలు చేపట్టాలి. గ్రామస్తులతో కలిసి స్థానిక తహశీల్దార్, ఆర్‌డీవోలకు అనేక సార్లు ఫిర్యాదు చేశాం. ఇప్పటి వరకూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇకనైనా చెరువులోకి విష పదార్థాలు వదులుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

● జోగి శివకుమార్, సీపీఎం పార్టీ సెంట్రల్‌శాఖ కార్యదర్శి

సికె బాబును కలిసిన మైనార్టీ నాయకులు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు:

చిత్తూరులోని మాజీ ఎమ్మెల్యే సీకే బాబుని, చిత్తూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్ మోహన్ గంగాధరనెల్లూరు మండలం ఆవలకొండ టిడిపి ముస్లిం మైనార్టీ సోదరులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్తూరులోని వారి స్వగృహంలో వారిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సన్మానించారు. జిడి నెల్లూరు టిడిపి నియోజకవర్గ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి నియాజ్‌అలీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మైనార్టీ సోదరులు చిత్తూరు, గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. టిడిపి జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, బుక్కపట్నం మాజీ సర్పంచ్ దేవరాజు రెడ్డి, వెంకటేష్ యాదవ్, అతేహార్ అలీ, జోహార్, మహది, అలీ అబ్బాస్ పాల్గొన్నారు.

సీఐగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మయ్య

ప్రజాశక్తి- బంగారుపాళ్యం:

బంగారుపాళ్యం యూ/జీ పోలీస్ స్టేషన్‌కు నూతన సీఐగా లక్ష్మయ్య గురువారం బాధ్యత చేపట్టారు. కర్నూలు నుండి బదిలీపై బంగారుపాళ్యం సీఐగా వచ్చిన ఆయన బాధ్యత చేపట్టి నట్టు తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న నాగరాజు విఆర్‌కు బదిలీపై వెళ్లారు. మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘట నలో జరగనీయకుండా పూర్తి బాధ్యతలు నిర్వహించినట్టు తెలిపారు.

బీసీలకు న్యాయం జరిగింది..

రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్ రాజా

ప్రజాశక్తి- బంగారు పాళ్యం:

బీసీలకు వైఎస్సార్‌సీపీలోనే న్యాయం జరిగిందని రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్ రాజా అన్నారు. గురువారం ఆయన స్వగహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనే బడుగు బలహీన వర్గాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు బీసీలకు ఇవ్వాల్సిన పదవులను ఇవ్వడం జరిగిందన్నారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడిగా చేపట్టిన బీసీ గర్జన బీసీలను మోసం చేసే విధంగా ఉందని, గతంలో బీసీ ఓట్లతో అధికారం చేపట్టి బీసీలను విస్మరించిన పార్టీ తెలుగుదేశం అని, టిడిపిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. కురబ, ఈడిగ, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్లు అమరనాథ్, మొగులేశ్వర, చెంగల్ రాయులు, సుబ్రహ్మణ్యం, ఎంపిటిసి హరి పాల్గొన్నారు.

రైతులకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం:

మండలంలోని మాంబేడు పంచాయతీ పెరుమాళ్లపల్లి పంచాయతీ గ్రామాల్లోని 20 మంది రైతులకు తిరు పతి వ్యవసాయ కళాశాలో వేరుశనగ పంట సాగుపై శిక్షణా తరగ తులు నిర్వహించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కార్యక్రమంలో బాగంగా రైతు లకు వివిధ పంటల సాగులు, వాటి యాజమాన్య పద్ధతులు, తెగు లు, పురుగుల నివారణపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు కష్ణారెడ్డి, జాన్స్‌జాన్, వసుంధర, రూపేష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన

సిడిపిఒపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మహిళా దినోత్సవంను ఓట్లకోసం ఉపయోగించకుండే విధంగా వ్యవహరించిన కుప్పం ఐసిడిఎస్ సిడిపిఓను ఎన్నికల విధులు నుండి తప్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పష్టంగా ఎన్నికల మోడల్‌కోడ్ ఆఫ్ కాండక్ట్ ప్రభుత్వం సిబ్బంది రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని చెబుతున్నప్పటికీ వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేయాలని, చేతులు ఎత్తుమని అధికారులు దగ్గర ఉండి చెప్పించడం ఎన్నికల నిబంధనలు ఉల్లంగించడమే అవుతుందన్నారు. గత నాలుగు సంవత్సరాలగా కుప్పంలో అధికార పార్టీ కార్యకర్తలాగా ఆ అధికారి పని చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ అధికారిగా ఉంటూ అంగన్వాడీలు 42 రోజులు కార్యాలయం వద్ద సమ్మె చేస్తే ఒకరోజు కూడా ఆఫీసుకు రాలేదు. అలాంటి అధికారి ఎన్నికల విధుల్లో కొనసాగిస్తే ప్రమాదమన్నారు. అంగన్వాడీల లబ్దిదారులను ప్రలోభాలకు గురి చేస్తుందన్నారు. కావున ఇలాంటి అధికారిపై చర్యలు తీసుకొని ఎన్నికల విధులు నుంచి తప్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఓజిలి: సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని కర్రబల్లోలు ఆర్ అండ్ బి రహదారి నుండి చిలమానుచేను, భువనగిరిపాలెం గ్రామాలకు సుమారు రూ.8.38 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

కార్యక్రమంలో సాయిరాం, హంసవేణి, అరుణారెడ్డి, రఘురాంరాజు, ఖాదర్‌బాషా, హరినాథ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారు సంఘాలపై అవగాహన కల్పించండి: శ్రీనివాస్

ప్రజాశక్తి-రేణిగుంట:

రైతు ఉత్పత్తిదారు సంఘాలపై అవగాహన కల్పించాలని శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండలం లోని కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ సలహా మండలి సమావేశంను ఘనంగా నిర్వహించారు. గురువారం రాస్ కెవికెలో జరిగిన నిర్వహించిన శాస్త్రీయ సలహా మండలి సమావేశానికి తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధనా సంచాలకులు డా.సి.రమణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రమణ, నాగరాజు, ముకుందారావు తదితరులు పాల్గొన్నారు.

అమరరాజాలో మాక్‌డ్రిల్

ప్రజాశక్తి-రేణిగుంట:

అమరరాజా ఎనర్జీ మొబిలిటీ పరిశ్రమలో సంబంధిత శాఖ అధికారుల ఆధ్వర్యంలో చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీసరిస్ రామక్రిష్నా రెడ్డి సహకారంతో మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించారు. సాదరణంగా పరిశ్రమలలో వచ్చే అనేక అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనడానికి, ఉద్యోగల సంసిద్ధత తరలింపు పరిస్థితులను పరీక్షించడానికి మాక్ డ్రిల్ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గురువారం అమరరాజా ఫ్యాక్టరీలో అసిటిలీన్ గ్యాస్ లీకేజ్ పైన మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్ లో అబ్సర్వర్ లు హిందుస్థాన్ కోకో కోల ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ అలాగే గ్యారేజ్ రిపేర్ షాప్ సౌత్ సెంట్రల్ రైల్వే పరిశ్రమల భద్రతా అధికారులు పాల్గొని సూచనలు, సలహాలు ఇచ్చారు.

కక్ష సాధింపుల్లో భాగమే పోలీసు సోదాలు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగానే వైసీపీ ఆదేశాలతో జనసేన సిబ్బంది నివసించే ప్రాంతాలపై పోలీసులు సోదాలు చేసి అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రేఖర్ అన్నారు. గూడూరు నియోజకవర్గ జనసేనపార్టీ కార్యాలయంలో గురువారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ మంగళగిరి ప్రాంతంలో జనసేన పార్టీకి పనిచేసే సిబ్బంది నివసించే అపార్ట్మెంట్‌లో పోలీసులు బుధవారం అర్థరాత్రి అక్రమంగా చొరబడి కారణాలు ఏమి చెప్పకుండా అపార్ట్మెంట్లో గంజాయి పొట్లలు పెట్టి అక్రమ కేసులు పెట్టేందుకు ప్రయత్నాలు జరిగాయని పేర్కొన్నారు. సమావేశంలో వంశీకృష్ణ, అవినాష్, సనత్, పెంచలయ్య, సాయికిరణ్, మగ్గం నాని పాల్గొన్నారు.రి

మైనార్టీల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-గూడూరుటౌన్: వైసీపీ అధికారంలో మైనార్టీల అభి వృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సనత్‌నగర్‌లోని ఎమ్మెల్సీ నివాసం వద్ద పట్టణ, రూరల్‌కి సంబంధించి ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సి.ఎం.జగన్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మగ్దూమ్ మొహిద్దీన్, మోబిన్ బాషా, దేవసేనమ్మ, గోపాల్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, విజయకుమార్, విజయమోహన్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేకు సహకరించండి: సర్పంచ్

ప్రజాశక్తి-ఏర్పేడు: ఎం.డి పుత్తూరులో సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో రి సర్వేపై గ్రామసభ నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దార్ సంతోష్ పాల్గొన్నారు. సోమవారం నుండి గ్రామంలో జరిగే రీ సర్వే విధివిధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మొత్తం 1268ఎకరాలకు సంబంధించి రోజుకి 20ఎకరాలు రీసర్వే జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో మడిబాక సర్పంచ్ చెంగల్‌రాజు, వీఆర్వో రవి, సర్వేయర్ మునిబాబు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-ఏర్పేడు:

మండలంలోని స్థానిక రాజులపాలెం ఎస్టీ కాలనీలో రజకుల కులానికి చెందిన చెంగమ్మ కుటుంబానికి మల్లవరంలో ఉన్న ముని జనరల్ స్టోర్ వారి సహకారంతో యువ నేస్తం అసోసియేషన్ తరపున 30రకాల నిత్యవసర సరుకులు అందజేశారు. చెంగమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - క్యాంపస్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వక్తలు ఉద్ఘాటించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం 21 స్నాతకోత్సం వేడుకగా ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో జరిగింది. రాష్ట్ర గవర్నర్ ఛాన్సలర్ హోదాలో ఎస్.అబ్దుల్ నజీర్ హాజరై ప్రసంగించారు. ముఖ్య వక్తగా ఇస్రో శాస్త్రవేత్త మంగళ మణి హాజరయ్యారు. ప్రముఖ నేపథ్య గాయని పద్మభూషణ్ పి.సుశీలకు గౌరవ పురస్కారాన్ని అందజేశారు. విసి ప్రొఫెసర్ డి.భారతి, రిజిస్ట్రార్ రజనీ విశ్వ విద్యాలయ అభివృద్ధిని వివరించారు. గవర్నర్ మాట్లాడుతూ మహిళా సాధికారిత విముక్తి, సమాజానికి అర్ధవంతమైన సహకారం అందించడానికి ఎంతో తోడ్పాటు అందిస్తోందన్నారు. మహిళలకు జ్ఞానం, నైపుణ్యం, శిక్షణ అవకాశాన్ని అందిస్తోందని, నాలుగు దశాబాదలలో ఆర్థికంగా గణనీయమైన పురోగతిని సాధించి తద్వారా సమాజానికి దోహదపడుతున్నారని ప్రశంసించారు. ఆర్థిక, రాజకీయ అభివృద్ధిలో యూనివర్సిటీ ముందంజలో ఉందన్నారు. అన్ని కీలక రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరుగుతోందని, మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఆమోదించడం వల్ల మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉంటుందని, రాష్ట్ర, జాతీయ విధాన రూపకల్పన, పాలనస్థాయి మహిళలను చేర్చుకోవడం వల్ల అత్యధిక మెజారిటీ లభిస్తుందని అన్నారు. ఇస్రో ఛైర్మన్ మంగళ మణి మాట్లాడుతూ చారిత్రాత్మకమైన అంటార్కిటిక్ ఎక్స్పెడిషన్ కొరకు 400 రోజులు చేసిన ప్రయాణంలో ఎన్నో సవాళ్ళను ఎదుర్కొన్నానని అన్నారు.వీసీ డి.భారతి మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఏకైక మహిళా వర్సిటీ నాక్ ఎ గ్రేడ్ సాధించడం గర్వకారణమన్నారు.

పాపులర్ ఫిమేల్ ప్లే బ్యాక్ సింగర్ పీ.సుశీల పద్మ భూషణ గ్రహీతకి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుండి గవర్నర్ చేతుల మీదుగా గౌరవ డాక్టర్ ఆఫ్ లెటర్స్ డిగ్రీ పట్టాను, జ్ఞాపికను అందచేశారు. డాక్టరేట్ పట్టా అందుకుంటున్న అందరు పట్టభద్రులచే గవర్నర్ ప్రమాణం చేయించారు. 34 మంది డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ ఇన్ సైన్సెస్ లో అర్హత సాధించిన వారికి, సోషల్ సైన్సెస్, హ్యూమనిటీస్, మేనేజ్మెంట్ లో పీహెచ్డీ పొందిన 29 మందికి పట్టాలు గౌరవ గవర్నర్ చేతుల మీదుగా అందజేశారు. స్కూల్ ఆఫ్ సైన్సెస్, ఇంజినీరింగ్, టెక్నాలజీ నందు విశేష ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు గోల్డ్ మెడల్/ సిల్వర్ మెడల్ పొందిన 36 మంది, బుక్ ప్రైజెస్ 05, క్యాష్ ప్రైజ్ 01, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, హ్యూమనిటీస్ మరియు మేనేజ్మెంట్ నందు ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు గోల్డ్ మెడల్/ సిల్వర్ మెడల్ పొందిన 21 మంది, బుక్ ప్రైజెస్ 07, క్యాష్ ప్రైజ్ 03 అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీషా, ఎస్పి కష్ణ కాంత్ పటేల్, ఆర్డీఓ నిశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

వేడుకగా పద్మావతి మహిళా వర్సిటీ స్నాతకోత్సవం

వృత్తి నైపుణ్యంతో రైతులకు సేవలు అందించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వ్యవసాయ శాఖ సిబ్బంది వృత్తి నైపుణ్యంతో రైతులకు సేవలు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు అన్నారు. సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయో సైన్స్ ఇంటర్నేషనల్ (కాబి) అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ, జిల్లా వ్యవసాయ అధికారులకు ప్రాంతీయ వ్యసాయ పరిశోధనా కేంద్రంలో సాగు సలహాలు ఇచ్చేందుకు డిజిటల్ యాప్స్పై వర్క్షాపు జరిగింది. 'కాబి' అందిస్తున్న డిజిటల్ సేవలు రైతుల అభివృద్ధికి దోహదపడుతుందని, అధికారులు వినియోగించుకుని సేవలు అందించాలని డిఎఒ కోరారు. 'కాబి' అందిస్తున్న వివిధ ఉచిత ఆన్లైన్ కోర్సులు, డిజిటల్ యాప్స గురించి విరించారు. ఈ కార్యక్రంలో జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ భాస్కరయ్య పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడికి చెక్ : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఉద్యోగులు వారి దైనందిన జీవితంలో ఉద్యోగ బాధ్యతలతో పాటు, మానసిక, శారీరక ఆరోగ్యం సమతుల్యంగా ఉంచుకోవాలని, అందుకోసం ప్రతిరోజూ ఉదయం ఓ గంట పాటు యోగా చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. గురువారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్నందు కలెక్టరేట్ ఉద్యోగులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల కోసం యోగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డిఆర్ఒ పెంచల కిషోర్ పాల్గొన్నారు.

చారిత్రాత్మక జ్ఞాపకాలను కాపాడుకోవాలి : భూమన

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి చెన్నారెడ్డి కాలనీలో ఆధునికరించిన కష్ణమనాయుడి కుంటను టీటీడి ఛైర్మెన్, తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర రెడ్డి ముఖ్య అతిథిగా, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, తిరుపతి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. కష్ణమనాయుడి కుంటను తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ నిధులు కోటి యాభై లక్షల వ్యయంతో ఆధునికరించి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ కోనేరును ఆధ్యాత్మికంగా నిర్వహించేందుకు ఇస్కాన్ టెంపుల్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పుణిత, ఇతర కార్పొరేటర్లు తిరుపతి మునిరామిరెడ్డి, వరికుంట్ల నారాయణ, మునిసిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డిఈ విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఆ రోడ్డుకు మోక్షం

రూ.8 కోట్లతో డబుల్‌లైన్ రోడ్డు / ఆర్ అండ్ బి, తుడా నిధులతో అభివృద్ధి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అగ్రహారం– రామాపురం రోడ్డంటేనే హడల్. గ్రావెల్, ఇసుక, గుల్ల ఎక్కువగా రవాణా అవుతూ ఉంటుంది. మున్సిపాలిటీకి

చెందిన వ్యర్థాలు సైతం లారీల్లో, ట్రక్కుల్లో రామాపురం డంపింగ్ యార్డుకు నిత్యం వెళుతూ ఉంటాయి. అగ్రహారం నుంచి రామాపురం వరకూ విల్లాలు, అపార్టుమెంట్లు ఎక్కువ కావడంతో ద్విచక్రవాహనాలు, కారులతో రద్దీ ఎక్కువయ్యింది. 40 అడుగుల రోడ్డు కావడంతో ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగి మూడేళ్లలో 52 మంది మృత్యువాత పడ్డారు. వందల మంది వికలాంగులయ్యారు. ఆ రోడ్డును విస్తరించాలని వేదాంతపురం, దుర్గసముద్రం, మల్లంగుంట, చిగురువాడ, రామాపురం, కూపుచంద్రపేట, రామచంద్రాపురం సర్పంచులు, ఎంపిటిసిలు ప్రభుత్వానికి విన్నవించినా 'చెవి'కెక్కలేదు. ఎన్నికలు దగ్గర పడడంతో ఆ పంచాయతీల ఓట్ల కోసం స్థానిక ఎంఎల్ఎకు ఆ రోడ్డు గుర్తుకొచ్చింది. అనుకున్నదే తడవుగా ఆర్ అండ్ బి, తుడా సంయుక్తంగా 8 కోట్ల నిధులను కేటాయిస్తూ రోడ్డు పనులు ప్రారంభించారు. రెండు లైన్లుగా ఆ రహదారిని విస్తరించనున్నారు. మధ్యలో డివైడర్లు, టి ఆకారంలో పోల్స్ వేసి విద్యుత్ వెలుగులు రానున్నాయి. ఈ రోడ్డు 'సి' రామాపురం రకూ వేయాలని ప్రతిపాదన ఉంటే, రెండేళ్ల క్రితం కొట్టుకుపోయిన చిగురువాడ బ్రిడ్జిని పూర్తి చేయాల్సి ఉంది. అది ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి లేదు. దీంతో ఎన్నికల నేపథ్యంలో 8 కోట్ల నిధులు కేటాయించి 'మమ' అనిపించుకునేందుకే నిర్మాణం జరుగుతోందని ప్రతిపక్షమైన టిడిపి విమర్శిస్తోంది. ఈ రోడ్డు బైపాస్ నుంచి చిగురువాడ శివాలయం వరకూ నాలుగు కోట్ల కిలోమీటర్ల దూరానికే 8 కోట్లను ఖర్చు చేయనున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

మహా శివరాత్రి శుభాకాంక్షలు

ప్రత్యేక అనుబంధం

మహాశివరాత్రికి ముక్కంటి క్షేత్రం ముస్తాబు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

దక్షిణ కైలాసంగా పేరుగాంచిన శ్రీకాళహస్తి క్షేత్రం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయంలో వివిధ రకాల పుష్పాలంకరణ భక్తులకు కనువిందు చేస్తోంది. ఆలయానికి నాలుగు ప్రవేశ ద్వారాల్లో ఏర్పాటు చేసి స్వాగత తోరణాలు చూడముచ్చటగా ఉన్నాయి. నవయుగ వారిచే నిర్మించబడిన రాజగోపురం రాజసం ఉట్టిపడుతోంది. ఆలయ పరిసరాల్లో ఓంకార నాదం మార్మోగుతోంది. శ్రీకాళహస్తిలోకి ప్రవేశించే అన్ని మార్గాల్లో ఏర్పాటు చేసిన తోరణాలు భక్తులకు స్వాగతం పలుకుతున్నాయి. మాడ వీధుల్లో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల కటౌట్లు రాత్రివేళలో కనువిందు చేస్తున్నాయి. ఇక స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఆలయ అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. భక్తుల మధ్య తొక్కిసలాట జరగకుండా... శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.



హంస, చిలుక వాహనాలపై ఊరేగుతున్న స్వామి, అమ్మవారు



విద్యుత్ కాంతుల్లో శ్రీకాళహస్తి దేవస్థానం

నేడు నంది సేవ

6వ రోజు శుక్రవారం రాత్రి నందిసేవ నిర్వహించనున్నారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి బంగారు నందిపైనా.. జ్ఞానప్రసూనాంబ అమ్మవారు సింహ వాహనం పైనా అధిష్టించి పురవిహారం చేయనున్నారు. తిరుమల బ్రహ్మోత్సవాలలో గరుడసేవకు ఎంత ప్రాధాన్యం ఉందో.. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే నందిసేవకు అంతే ప్రాధాన్యత ఉంది. నంది, సింహ వాహనాలపై ఊరేగుతున్న శివ, పార్వతులను దర్శించుకోవడానికి భక్తులు వేల సంఖ్యలో తరలి వస్తారు. నందిసేవ సందర్భంగా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇక ఉదయం స్వామి వారు ఇంద్ర విమానం పైనా.. అమ్మవారు చప్పరం పైనా భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు.

శ్రీకాళహస్తి క్షేత్ర మహత్యమిదీ...!

శైవ క్షేత్రాల్లో తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి క్షేత్రం ఇల కైలాసంగా ఖ్యాతి గాంచింది. సృష్టిలోని భూమి, ఆకాశం, నీరు, వాయువు, అగ్ని అనే శక్తులను పరమేశ్వరుడు తనలో నిక్షేపించుకుని లింగాకారంలో ఇక్కడ ఆవిర్భవించాడు. కంచిపీఠం మట్టిలింగంగా... చిదంబర క్షేత్రంలో ఆకాశలింగంగా... జంబుకేశ్వరంలో జల లింగంగా... అరుణాచలంలో అగ్నిలింగంగా... శ్రీకాళహస్తిలో వాయులింగంగా ఆవిర్భవించాడు. ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా శ్రీకాళహస్తీశ్వరుని గర్భాలయంలో రెండు దీపాలు లింగం యొక్క ఉచ్ఛ్వాస, నిశ్వాసలతో వచ్చే గాలితో కదులుతూ ఉంటాయి. ఈ ఆలయంలోని లింగం స్వయంభులింగం. శ్రీకాళహస్తీశ్వర ఆలయం 12వ శతాబ్దంలో చోళరాజులు నిర్మించినట్లుగా చారిత్రక ఆధారాలు ఉన్నాయి.

వార్త తరువాయి 10 లో..

మహాశివరాత్రికి ముక్కంటి క్షేత్రం ముస్తాబు

మొదటి పేజీ తరువాయి

రాజేంద్రచోళుని పాలన 13వ శతాబ్దంలో ముగిసిన తరువాత విజయనగర రాజులైన సాలువ రాజు, శ్రీకృష్ణ దేవరాయలు, శ్రీకాళహస్తి జమీందారుల హయాంలో ఈ ఆలయం అనేక రకాలుగా అభివృద్ధి చెందిందని చెబుతారు. శ్రీకాళహస్తి క్షేత్రాన్ని దక్షిణ కైలాసమని, భాస్కర క్షేత్రమని, అఖండ బిల్వ వనమని, సద్యోముక్తి క్షేత్రమని, శివానందైక నిలయమని పురాణాల్లో చెప్పబడింది. ఇక్కడ శివలింగాన్ని పూజించి సాలె పురుగు, పాము, ఏనుగు, మోక్షం పొందాయి. అందుకే ఈ క్షేత్రానికి శ్రీ(సాలె పురుగు)- కాళ(పాము)- హస్తి(ఏనుగు) అనే పేరు వచ్చింది. ఇక తిన్నడనే భక్తుడు శివునికి తన కన్ను ఇచ్చి భక్తకన్నప్పగా పేరు గాంచాడు. అందుకే శ్రీకాళహస్తి క్షేత్రంలో భక్తకన్నప్పకే తొలిపూజ చేస్తారు. ఆ తరువాతనే శ్రీకాళహస్తీశ్వరునికి పూజలు చేస్తారు. ఈ ఆలయంలో జగన్మాత అయిన పార్వతీదేవి జ్ఞాన ప్రసూనాంబగా వెలిశారు. జ్ఞాన ప్రసూనాంబ దేవి తాను సంపాదించిన జ్ఞానం మొత్తం సర్వ జీవరాసులకు పంచి పెడుతుందని ప్రతీతి. అమ్మవారిని దర్శించుకుంటే జ్ఞానం సిద్ధిస్తుందనే నమ్మకం భక్తుల్లో ఉంది.

హంస-చిలుక వాహనాలపై భక్తులకు అభయం

శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా 5వ రోజైన గురువారం ఉదయం గంగాభవానీ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి హంస వాహనం పైనా... జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు చిలుక వాహనం పైనా పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఆలయం వెలుపల నుంచి మంగళ వాయిద్యాలు, కోలాటాలు, పండరి భజనలు, శక్తి అమ్మవార్ల వేష ధారణలతో భక్త బృందాలు వాహన సేవల ముందు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మొదట అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేషంగా అలంకరణ చేశారు. ఆలయ పురోహితులు పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పురవిహారానికి తీసుకువచ్చారు. వినాయకస్వామి, శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప స్వామి, అమ్మవార్లను అనుసరించారు. పురవీధుల్లో ఊరేగుతున్న పంచమూర్తులను పలువురు భక్తులు దర్శించుకున్నారు. కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్వీ నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంచే ముక్కంటికి పట్టు వస్త్రాలు సమర్పణ

శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున గురువారం డిప్యూటీ సీఎం నారాయణస్వామి పట్టువస్త్రాలు సమర్పించారు. నారాయణస్వామికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి, ఆలయ అధికారులు సాంప్రదాయ బద్ధంగా సుపథ మండపం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అక్కడ నుంచి మంగళ వాయిద్యాలు, మేళ తాళాల మధ్య పట్టు వస్త్రాలను ఆలయం లోపలకు తీసుకువచ్చారు. అలంకార మండపంలో ఈ పట్టు వస్త్రాలను ఆలయ సంప్రదాయాలతో వేద పండితులకు అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు నారాయణస్వామికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్వీ నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నాగపడగ నీడన ముక్కంటి భక్తకోటికి దర్శనం

సర్వాంతర్యామి అయిన శ్రీకాళహస్తీశ్వరుడు మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజైన గురువారం రాత్రి శేష వాహనం పైనా... జ్ఞానప్రసూనాంబ అమ్మవారు యాళి వాహనం పైనా భక్తకోటికి దర్శన భాగ్యం కల్పించారు. నాగరాత్రి పరమార్థాన్ని భక్తులకు తెలిసేలా పురవీధుల్లో విహరించారు. భక్తవత్సలుడుగా తలపై ఒకటి, కంఠంలో ఒకటి.. భుజకీర్తులుగా రెండు.. చేతులకు రెండు.. కాళ్లకు రెండు.. నడుముకు ఒకటి చొప్పున మొత్తం 9 సర్పాలను అలంకరించుకుని పన్నగ భూషణుడుగా భక్తులకు దర్శనమిచ్చారు. నిస్వార్థమైన భక్తిలో ఎలాంటి వైషమ్యాలు, వైరుధ్యాలు ఉండకూడదనే పరమార్థాన్ని తెలిసేలా స్వామి, అమ్మవార్లు భక్తులకు అభయమిచ్చారు. వినాయకస్వామి మూషిక వాహనం పైనా... శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప చప్పరాల పైనా అధిష్ఠించి స్వామి, అమ్మవార్లను అనుసరించారు. శేష, యాళి స్వర్ణకాంతులతో దేదీప్యమానమై వెలుగుతూ పురవిహారం చేస్తున్న స్వామి, అమ్మవార్లను దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కాగా ఉదయం స్వామి వారు బంగారు హంస వాహనం పైనా.. అమ్మవారు చిలుక వాహనం పైనా పురవిహారం చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

శంకరుని ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- వెదురుకుప్పం, కార్వేటినగరం

మండలంలోని కోనేరుకట్టపై వెలసిన ఉమాతంగమేశ్వరుడు ఉత్సవాలను మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆయన ధర్మకర్త అంబరిష్ రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నిశ్శంఖ, శశాంక శంకరుడుగా పేరుపొందిన శివుని విగ్రహాన్ని చోళుల కాలంలో ప్రతిష్టించారు. ఈ విగ్రహం డిఎపురం పంచాయతీలోని నిశంఖ దుర్గంలో ప్రతిష్టించడం జరిగింది. కార్వేటినగరం చెందిన తంగవేలు, సుబ్బరాజు వారి అనుచరులు 1984లో సాంప్రదాయబద్ధంగా తీసుకొచ్చి కోనేరుకట్టపై ప్రతిష్టించారు. స్వామి పేరు ఉమా తంగమేశ్వరస్వామిగా నిర్ధారించారు. 2021 నుంచి దాతల సహకారంతో గుడి నిర్మాణం చేపట్టి దినదినాభివద్ధి చేస్తున్నారు. ఈ గుడి ఆవరణంలో సుబ్రహ్మణ్యస్వామి, విగ్నేశ్వరస్వామి, దక్షిణామూర్తి, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్టించారు.

అంబరీషరాజు, తంగమేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త, కార్వేటినగరం మండలం

మహాశివరాత్రికి ముస్తాబవుతున్న శివాలయాలు

ప్రజాశక్తి-రామచంద్రపురం: మండలంలో శుక్రవారం నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు శివాలయాలు అంగరంగ వైభవంగా ముస్తాబవుతున్నాయి. మండలంలోని రాయలచెరువు కట్ట కింద ఉన్న శ్రీ భవాని శంకర్ ఆలయం, పార కాలవలోని నవశక్తి పీఠం, రేకుల చేను గ్రామంలోని శ్రీ జన్మస్థల శివాలయం, బొప్పరాజు పల్లిలోని శ్రీ బుగ్గ మల్లేశ్వర స్వామి ఆలయం, తిరుపతి రూరల్ మండలంలోని చిగురువాడ సమీపంలోని స్వర్ణముఖి శివపార్వతుల దేవాలయం, దుర్గ సముద్రం, అడపా రెడ్డిపల్లి, గొల్లపల్లి గ్రామాల్లోని శివాలయాలు చంద్రగిరి మండలంలో తొండవాడ సమీపంలోని శ్రీ అగస్తీశ్వర స్వామి ఆలయం, పుటాలమ్మ గుడి ఆవరణంలోని శివాలయం, శేషాపురంలోని శేషాచల శివాలయం, శ్రీనివాస మంగాపురం లోని శివాలయాలలో పచ్చని పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ, మామిడి

తోరణాలతో అత్యంత వైభవంగా ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. భక్తులు దర్శనానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు నిర్వాకృత్యాలు.

నంది వాహనంపై బోలా శంకరుడు

బంగారుపాళ్యం: అధికార నంది వాహనంపై బోలా శంకరుడు గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు గురువారం ఉదయం మండలంలోని గాండ్లపల్లి గ్రామానికి చెందిన సాంబశివ నాయన వారి కుటుంబ సభ్యులు అధికార నంది వాహనానికి ఉభయ దారులుగా వ్యవహరించారు. రాత్రి సింహ వాహనంపై శివపార్వతుల భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా ఉషోదయ పాఠశాల యాజమాన్యం ప్రతాప్‌చంద్ర నాయుడు వ్యవహరించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి మునిరాజులు, తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లి గ్రామంలోని శ్రీశ్రీశ్రీ బండెమ్మ కొమరెద్దయ్య ఆవు దేవర నందీశ్వరాలయంలో శుక్రవారం నుంచి మహాశివరాత్రి సందర్భంగా భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే బండి సుభద్రమ్మ, జానకిరామిరెడ్డిల కుమారుడు గుణశేఖర్ రెడ్డి, బండి దీక్షిత అన్నదానం చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

శివరాత్రి సందర్భంగా యదమరి చిత్రకారుని

చిత్రకళా స్పందన

యాదమరి: మహా శివరాత్రి సందర్భంగా యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆర్ట్ మాస్టర్ కె.దామోదరాచారి తమలపాకుపై అర్ధనారీశ్వర చిత్రాన్ని చిత్రించడం జరిగింది. పూజకు ప్రధానంగా వినియోగించే తమలపాకు ఎంతో శ్రేష్టమైనది, స్వచ్ఛతకు, సౌభాగ్యానికి, సకల ఐశ్వర్య సిద్ధికి ప్రతీక అయిన తమలపాకు లక్ష్మీదేవికి ప్రియమైనదని చెబుతారు. శివుడు తన శరీరంలోని అర్ధభాగాన్ని భార్యకిచ్చి ఆడమగ సమానమని సత్యాన్ని ప్రపంచానికి చాటాడు. ఈరోజు ప్రపంచ మహిళా దినోత్సవం కూడా కావడంతో అర్ధనారీశ్వర తత్వాన్ని అర్ధం చేసుకొని ప్రతి ఒక్కరూ సుఖ జీవితాన్ని నిర్మించుకోవాలి.

ఆకట్టుకుంటున్న ఏకపాద మూర్తి

నగరి: మునిసిపల్ పరిధి కీళపట్టు త్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వర ఆలయ ఆవరణలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని వినూత్న శివాకారాలు చేయడం పరిపాటి. అందులో భాగంగా ఈ ఏడాది నిర్మించిన 9 అడుగుల ఎత్తున్న ఏకపాద మూర్తి ప్రతిమ, అఘోరీలు శివుని విగ్రహం ముందు తపస్సుచేస్తున్న ప్రతిమలు పలువురిని ఆకర్షిస్తోంది. అతి కష్టమైన ఈ విగ్రహం స్థానిక భక్తుడు గణేశ్ అతనితో పాటు స్థానిక యువకులు నెలరోజుల పాటు శ్రమించి తయారుచేశారు. శివుని ముందు తపస్సు చేసిన అఘోరీలకు శివుడు, బ్రహ్మ, విష్ణువు ఒక్కటే అని చేపే విధంగా శివుడు ఏకపాదంలో మూడు రూపాలు ధరించి సాక్షారించడమే ఏకపాదమూర్తి అవతారమని ఆలయ నిర్వాహకులు జలగండా సుబ్రమణ్యం తెలిపారు. శివుని ఆకారానికి రుద్రాక్షలు, మహావిష్ణువు ఆకారానికి తులసి పూసలు, బ్రహ్మ ఆకారానికి తామర గింజలు వాడినట్లు తెలిపారు.

సిఐగా లక్ష్మయ్య బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: బంగారుపాళ్యం యా/జీ పోలీస్ స్టేషన్‌కు నూతన సీఐగా లక్ష్మయ్య గురువారం బాధ్యత చేపట్టారు. కర్నూలు నుండి బదిలీపై బంగారుపాళ్యం సీఐగా వచ్చిన ఆయన బాధ్యత చేపట్టినట్టు తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న నాగరాజు విఆర్‌కు బదిలీపై వెళ్లారు. మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలో జరగనీయకుండా పూర్తి బాధ్యతలు నిర్వహించినట్టు తెలిపారు.

రైతులకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు పంచాయతీ పెరుమాళ్లపల్లి పంచాయతీ గ్రామాల్లోని 20 మంది రైతులకు తిరుపతి వ్యవసాయ కళాశాలో వేరుశనగ పంట సాగుపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కార్యక్రమంలో బాగంగా రైతులకు వివిధ పంటల సాగులు, వాటి యాజమాన్య పద్ధతులు, తెగులు, పురుగుల నివారణపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు కష్ణారెడ్డి, జాన్సజాన్, వసుంధర, రూపేష్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనానికి

రెండు ఎకరాల స్థలం కేటాయింపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా కేంద్రమైన చిత్తూరు వన్నెకుల క్షత్రియులకు కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం మురకంబట్టు వద్ద రెండు ఎకరాలు కేటాయించింది. ఈ కమ్యూనిటీ భవనం స్థలం కేటాయింపులో వైసిపి అభ్యర్థి ఎంసి విజయానంద రెడ్డి ప్రభుత్వ అధికారులతో చర్చించి మంజూరు చేయించారని వన్నెకుల క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షులు కాశీ నాయకర్ తెలిపారు. గురువారం స్థానిక కొంగారెడ్డిపల్లిలోని విజయానందరెడ్డి కార్యాలయంలో వన్నెకుల క్షత్రియ పెద్దలు విద్యానంద రెడ్డిని కలిసి కతజ్ఞతలు తెలియజేశారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి- పూతలపట్టు: అభివృద్ధి సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మద్దిలయ్యగారిపల్లి గ్రామంలోని నీటిశుద్ధి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంక్షేమ ఫలాలతో సంతోషంగా ఉన్నారని చెప్పారు. వైసిపి ప్రభుత్వాన్ని మరోమారు అధికారంలోకి తేవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఎంపీ రెడ్డప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్, మండల నాయకులు బాబురెడ్డి లోకేష్‌రెడ్డి, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టండి..

ప్రజాశక్తి- కార్వేటినగరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధిలో భాగంగా విద్యార్థులకు ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న జగనన్న గోరుముద్దను విద్యార్థులకు నాణ్యతగా అందించాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం నాణ్యతలో ఎక్కడ లోపం లేకుండా చూడాలని, విద్యార్థుల నుంచి విమర్శలు వస్తే ఇబ్బందులు తప్పవని చెప్పారు.

తెలుగు మహిళ అధ్యక్షురాలుగా

బాలినేని కవిత

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలుగా రూరల్ మండలం వనమలదిన్నె గ్రామానికి చెందిన బాలినేని కవితను నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి నియమించారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు గురువారం అందించారు. నియోజకవర్గంలో మహిళా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అభిమానిగా కొనసాగుతున్నారని అందుచేత ఆమె సేవలను పార్టీ గుర్తించి ఈ పదవి ఇవ్వడం జరిగిందని తెలిపారు.

వైఎస్సార్ చేయూత కింద జిల్లాలో 1,04,226 మందికి

రూ.195.42 కోట్లు: జెసి

వైయస్సార్ చేయూత మెగా చెక్కును అందజేస్తున్న జెసి పి. శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నాలుగో ఏడాది వైఎస్సార్ చేయూత పథకం కింద అనకాపల్లి జిల్లా నుంచి గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఆర్థిక సహాయాన్ని బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించారు. చిత్తూరు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, నగర మేయర్ అముదా, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, డీఆర్‌డిఎ, మెప్మా పిడిలు తులసి, రాధమ్మ వర్చువల్‌గా పాల్గొన్నారు. జెసి మాట్లాడుతూ 45 నుండి 60 ఏళ్ల మధ్య వయసు గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశ్యంతో సిఎం జగన్ మోహన్ రెడ్డి సంవత్సరానికి రూ.18,750 చొప్పున నిధులు అందజేసినట్లు తెలిపారు. చిత్తూరు జిల్లాకు సంబంధించి 1,04,226 మంది లబ్ధిదారులకు గాను రూ.195.42 కోట్లను ముఖ్యమంత్రి బటన్ నొక్కి నిధులను విడుదల చేశారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును జెసి మహిళ సభ్యులకు అందజేశారు.

పారదర్శకంగా ఎన్నికల విధులు: కమిషనర్

సమావేశంలో మాట్లాడుతున్న నగర కమీషనర్ డాక్టర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో ఎన్నికల విధులను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని ఏఈఆర్వో, కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. ఎన్నికల నియమావళి అమలుపై గురువారం వార్డ్ ప్లానింగ్, శానిటేషన్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఏఈఆర్వో, కమిషనర్ మాట్లాడుతూ ఏ క్షణమైన ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్నందున క్షేత్రస్థాయిలో తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన వెంటనే వార్డు పరిధిలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా, ఓటర్లను ప్రలోభ పరిచేలా ఉన్న, రాజకీయపరమైన బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లను పూర్తిస్థాయిలో తొలగించాలన్నారు. కరెంటు స్తంభాలపై ఉన్న స్టిక్కర్లను తొలగించాలన్నారు. వార్డుస్థాయిలో ఎన్నికల నిబంధనలను పారదర్శకంగా అమలు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ర్యాలీలు, సభలు సమావేశాలకు సంబంధించిన సమాచారాన్ని ఎంసీసీ కమిటీ దష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి పొరపాట్లు చేయకుండా, ఉన్నతాధికారుల ఆదేశాలను అర్థం చేసుకొని కచ్చితంగా పనిచేయాలన్నారు. రాజకీయపరమైన కార్యక్రమాలకు ప్రభుత్వ ఉద్యోగులుగా దూరంగా ఉండాలన్నారు. వార్డుస్థాయిలో ఎన్నికల మార్గదర్శకాలు అమలుపై వీడియో సమావేశం ద్వారా వార్డు కార్యదర్శులకు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మార్గనిర్దేశం చేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని ఇంజనీరింగ్ విభాగం సిబ్బందితో సమావేశమై ఎన్నికల నిబంధనల మేరకు నడుచుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీ రామకష్ణుడు, ఇన్చార్జ్ ఎంహెచ్‌ఓ చిన్నయ్య, డీఈలు వెంకట ప్రసాద్, రమణ, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పలమనేరులో వంద పడకల ఆసుపత్రి ప్రారంభం



ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు పట్టణంలో నూతనంగా నిర్మించి 100 పడకల ప్రభుత్వం ఆసుపత్రి భవనాన్ని గురువారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఇంటి స్థల బదలాయింపు దస్తావేజుల పంపిణీ, లబ్ధిదారులకు ఇంటి పత్రాలను అందజేత, వైయస్సార్ చేయూత నగదు పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొదట వైయస్సార్ చేయూత నగదు పంపిణీ ద్వారా 2191మంది రూ.4.10కోట్లు లబ్ధి పొందినట్లు తెలిపారు. వారికి మెగా చెక్కును అందజేశారు. అలాగే పేదల ఇంటి స్థలాల రిజిస్ట్రర్ కన్వేయన్స్ డీడ్స్ కింద 26వ వార్డులో 4430 మందికి రిజిస్టర్ అయిన భూ బదిలీ పత్రం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపి రెడ్డప్ప, ఎమ్మెల్యే వెంకటే గౌడ, పురపాలక సంఘం చైర్‌పర్సన్ చాముండేశ్వరి సుధాకర్, వైస్ చైర్‌పర్సన్ గుల్జార్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని కల్లుపల్లి గ్రామ సచివాలయంలోని మల్లేరులో రూ.11లక్షలతో నిర్మించిన సిసి డ్రైన్లను, కలగటూరు గ్రామ సచివాలయంలో రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.21.80లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.9లక్షలతో నిర్మించిన సిసి.డ్రైన్లని గురువారం ఎమ్మెల్యే వెంకటే గౌడ ప్రారంభించారు. అలాగే కల్లుపల్లి గ్రామ సచివాలయంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్‌బికె భవనాన్ని, రూ.3.09లక్షలతో నిర్మించిన సిసి డ్రైన్లను, రూ.19.07లక్షలతో నిర్మించిన తాగునీటి ట్యాంక్‌ను కూడా ప్రారంభించడం జరిగింది. మేలుమాయి గ్రామ సచివాలయంలో రూ.21.80లక్షలతో నిర్మించిన ఆర్‌బికె భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటర్ల వెరిఫికేషన్‌లో నిర్లక్ష్యం వద్దు: జెసి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్నికల ప్రక్రియ ప్రధానమైనదని, ఓటరు జాబితాకు సంబంధించి ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా సకాలంలో విధులు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. గురువారం జాయింట్ కలెక్టర్ పెండింగ్ దరఖాస్తులకు సంబంధించి ఆర్‌ఓలు, ఏఈఆర్‌వోలు, మున్సిపల్ కమిషనర్‌లు, బిఎల్‌ఓలు ఇతర ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటున్న సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జెసి మాట్లాడుతూ జిల్లాలో పలు మండలాలలో ఫారం 6, ఫారంకు సంబంధించి పలు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు సంబంధించి మండలాల వారీగా సంబంధిత అధికారులను ప్రశ్నించారు. అదేవిధంగా ఫారం 7కు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్ణయాలు తీసుకోవాలని సంబంధిత ఆర్వోలు వీటిని వెంటనే పరిష్కరించాలన్నారు. డిఆర్‌ఓ పుల్లయ్య, ఈవీఎంల నోడల్ అధికారిని భవాని, ఎస్‌డిసి లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

మహాశివరాత్రి శుభాకాంక్షలు

కార్వేటి నగర్ ప్రజలకు,
మిత్రులకు, శ్రేయోభిలాషులకు
మహాశివరాత్రి
శుభాకాంక్షలు

అంబరీష్ రాజు
ఉమా తంగేశ్వర స్వామి సేవకులు
కార్వేటి నగరం

మహిళా సర్పంచ్‌గా ప్రజలు ఆదరించారు...

అంకితభావంతో సేవ చేశాను..

సర్పంచ్ చంద్రమ్మ, గంగవరం పంచాయతీ

సర్పంచ్ టి.చంద్రమ్మ

ప్రజాశక్తి- గంగవరం: ఓ మహిళా సర్పంచ్‌గా ప్రజలు తనకు అవకాశం కల్పించి ఆదరించారని దాన్ని దృష్టి ఉంచుకొని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ అంకితభావంతో సేవ చేశానని గంగవరం పంచాయతీ సర్పంచ్ చంద్రమ్మ తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె ప్రజాశక్తితో ముఖాముఖి మాట్లాడారు. గంగవరం పంచాయతీ పరిధిలో 18 గ్రామాలు 11వేల జనాభా ఉన్నారు. సర్పంచ్‌గా నేను ఎన్నుకున్నప్పటి నుంచి ప్రతి గ్రామంలో తాగునీటి సమస్యలు పరిష్కరించడంతోపాటు వీధిదీపాలను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించాను. అంతేకాకుండా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తూ గ్రామస్తుల సమస్యలు పరిష్కరించాను. పంచాయతీ పరిధిలో రూ.50లక్షల సిసి రోడ్డు, రూ.20లక్షల వ్యయంతో మురుగునీటి కాలువలు, రూ.6లక్షలతో నాలుగు తాగునీటి బోర్లు రూ.15లక్షలతో తాగునీటి ఓవర్ ట్యాంకులు నిర్మిచాను. అంతేకాకుండా పలమనేరు పట్టణానికి సమీపంలో ఉండటంతో మున్సిపాలిటీకి పోటీగా ప్రతి గ్రామంలోనూ పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే వారంలో ఒక రోజు సమావేశం నిర్వహించి మండల కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకునే సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నేను సర్పంచ్‌గా ఇంత అభివృద్ధి చేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు నా కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు ఎంతగానో ఉన్నాయి. పంచాయతీలోని మూడు సచివాలయాల సిబ్బందితో నెలకోసారి సమావేశం నిర్వహించి ప్రజల నుంచి వస్తున్న వినతులు, సమస్యలు పరిష్కరించేలా సలహాలు, సూచనలు ఇస్తూ వార్డుల్లో ఎటువంటి సమస్యలున్నా అప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉన్నాను. ముఖ్యంగా ఈ పంచాయతీలో ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలు ఉండడంతో మధ్యాహ్నం సమయంలో విద్యార్థుల అందిస్తున్న భోజనంను పరిశీలించి విద్యార్థులకు మెనూప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని వంట నిర్వాహకులకు సూచనలు ఇస్తూ ఉంటాను. నన్ను నమ్మి ఓటు వేసిన ప్రజలకు నా వంతు సహాయం చేయాలన్నదే నా ధ్యేయం. వాళ్ల సమస్యలు పరిష్కరించడంతో నా వంతు సహకారం, గ్రామాల అభివృద్ధిలోనూ నాదైన గుర్తింపును పొందాను.

మహిళా దినత్సోవం సందర్భంగా మహిళలందరూ అన్ని రంగాల్లో రాణించాలని, ఉత్తమ విద్య, ఉద్యోగాలతో పురుషులతో సమానంగా ఎదగాలని ఆకాక్షించారు. బాలికలు చిన్న వయస్సు నుంచే క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. విద్య, ఉద్యోగం, రాజకీయం, వైద్యం వంటి ప్రముఖమైన అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని తెలిపారు.

పి.రెడ్డిప్రసాద్, వైసిపి యువ నాయకులు